ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5 వరంగల్
మంగళవారం 2 ఏప్రిల్ 2024



ఆ 452 మంది ఎక్కడ?

క్షేత్రస్థాయిలో కనిపించని పారిశుధ్య సిబ్బంది

- విధులెక్కడ నిర్వహిస్తున్నారో తెలియని పరిస్థితి
- పరకాల నుంచి వచ్చిన మరో 30 మంది పరిస్థితేంటో?
- కార్పొరేటర్ల సేవలో బల్దియా శానిటేషన్ సిబ్బంది
- కొందరి ఇళ్ల వద్దకే బయోమెట్రిక్ మిషన్లు
- అంగట్లో సరుకుగా పారిశుధ్య కార్మికుల ఉద్యోగాలు
- లక్షలు దండుకుని అమ్ముకుంటున్న కొందరు ఉద్యోగులు, నాయకులు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 1: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిస్థితి 'పైన పటారం.. లోన లొటారం' అన్నట్టు ఉంది. ముఖ్యంగా పారిశుధ్య విభాగమైతే మరీ అధ్వానంగా తయారైంది. బల్దియా పారిశుధ్య విభాగంలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు అంగట్లో సరుకుగా మారాయి. ఇటీవల జరిగిన పీహెచ్ వర్కర్ల (పారిశుధ్య కార్మికులు) నియామకాల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్టు ప్రచారం జరుగుతుండగా.. ఈ పారిశుధ్య కార్మికుల పోస్టులను కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు డబ్బులకు అమ్ముకున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో సదరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రూ.లక్షల్లోనే దండుకున్నట్టు తెలుస్తోంది. ఇక ఇలా నియమితులైన 452మంది సిబ్బందితో పాటు పరకాల నుంచి వచ్చిన మరో30మంది అసలు ఎక్కడున్నారో.. ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో తెలియడం లేదు. కొందరు ప్రజాప్రతినిధుల సేవలో తరిస్తుంటే.. మరికొందరు హాజరుమాత్రమే వేసి దర్జాగా జీతాలు తీసుకుంటున్నారు. ఇది తెలిసికూడా ఉన్నతాధికారులు చోద్యం చేస్తున్నారనే విమర్శలున్నాయి.

బతుకు దెరువు కోసం..

వరంగల్ నగరంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన నిరుపేద దళితులు వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో బతుకుదెరువు కోసం ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్నారు. 25ఏళ్ల కిందట నెలకు రూ.500 జీతానికి చేరిన వారు.. ఇప్పుడు రూ.17,500 జీతం తీసుకుంటూ చెత్తా చెదారంతో సహవాసం చేస్తూ వృద్ధాప్యానికి దగ్గరయ్యారు. బల్దియా పరిధిలోని 66 డివిజన్లలో ప్రభుత్వ, ఔట్‌సోర్సింగ్ జవాన్లు, పీహెచ్ వర్కర్లు కలుపుకొని మొత్తంగా 2,800 మంది పనిచేస్తున్నారు. వీరంతా సీఎంహెచ్‌వో పర్యవేక్షణలో పని చేస్తారు. గతంలో బల్దియా పరిధిలో పారిశుధ్య పనులకు సిబ్బంది సరిపడా లేకపోవడంతో 2021లో అప్పటి కమిషనర్, మేయర్ నేతృత్వంలో ఎలాంటి విధివిధానాలు, నోటిఫికేషన్ లేకుండా 452మందిని పీహెచ్ వర్కర్లను తీసుకున్నట్టు తెలుస్తోంది. బల్దియా అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు.. స్థాయిల వారీగా పోస్టులు పంచుకుని ఒక్కో వ్యక్తి వద్ద రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు వసూలు చేసి ఉద్యోగాలను అమ్ముకున్నట్టు ఆరోపణలున్నాయి. అయితే ప్రస్తుతం ఆ 452మంది సిబ్బందితో పాటు పరకాల నుంచి వచ్చిన మరో30 మంది ఎక్కడ డ్యూటీలు చేస్తున్నారో అధికారులకు తెలియడం లేదు. దీనిపై సంబంధిత అధికారులను వివరణ అడిగితే పొంతన లేని సమాధానం వస్తోంది.

డ్రాప్ ఆఫ్ వర్కర్ల ఉద్యోగాలు..

ఆరోగ్యం సహకరించక కొందరు, దుర్వాసనతో అనారోగ్యానికి గురై కొందరు, వృద్ధాప్యంతో కొందరు పారిశుధ్య కార్మికులు పని చేయలేకపోతున్నారు. విధులకు హాజరుకాకుండా డ్రాప్ ఆఫ్ వర్కర్లుగా మిగిలిపోతున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు బల్దియా పర్మినెంట్ ఉద్యోగులు, కొందరు కార్మిక సంఘాల నాయకులు అందినకాడికి దండుకుంటున్నారు. కమిటీ నిర్ణయం లేకుండానే అధికారుల కనుసన్నల్లో ఒకరికి బదులు మరొకరిని నింపి రూ.2 నుంచి రూ.3లక్షలు తీసుకుని సంబంధిత అధికారులతో పంపకాలు చేసుకుంటున్నట్టు సమాచారం.

విధులెక్కడ?

పారిశుధ్య కార్మికులు రోడ్లు శుభ్రం చేయడం, కాలువలు తీయడం, ఇళ్ల నుంచి చెత్త సేకరించడం, చెత్త ట్రాక్టర్లపై చెత్త మోపు చేయడం, వాహనాలు, ట్రాక్టర్లపై డ్రైవర్లుగా పని చేయాల్సి ఉంది. కానీ వీరిలో చాలా మంది బీసీ, ఓసీ సామాజికవర్గానికి చెందిన వారు ఉండగా.. చాలామంది ఈ పారిశుధ్య పనులు చేయలేక నెలవారీగా కొంత ఇస్తూ నడిపిస్తున్నట్టు తెలిసింది. అంతేకాకుండా ఐదుగురు కార్పొరేటర్లు వారికి చెందినవారిని నియమించుకుని ఇంటికే బయోమెట్రిక్ మిషన్ తెప్పించుకుని దర్జాగా హాజరు వేయించుకుంటున్నారనే విమర్శలున్నాయి. మరో నలుగురు కార్పొరేటర్ల బంధువులు ఉదయం లేచి ఆయా అడ్డాల వద్దకు వెళ్లి విధులకు హాజరైనట్టు మిషన్‌లో వేలిముద్రలు వేసి ఇంటికి వెళుతున్నట్టు తెలుస్తోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 452 మందిలో 300మంది అడ్డదారిలో నెలవారీగా బ్యాంకుల నుంచి జీతాలు తీసుకుని కమిషనర్‌ను తప్పుదారి పట్టిస్తున్నారు. ఇదంతా ఎంహెచ్‌వోకు తెలియకుండా జరుగుతోందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అడ్డదారిలో జీతాలు పొందుతున్న వ్యక్తుల నుంచి కొందరు జవాన్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు నెల వారిగా డబ్బులు దండుకుంటున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇదంతా దీనిపై కొత్తగా వచ్చిన కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ప్రత్యేక దృష్టి సారించాలని కార్మికులు కోరుతున్నారు.

ట్రాక్టర్లపై మహిళలకు విధులు

ఇటీవల అధికారుల నిర్లక్ష్యం, కమిషనర్ పర్యవేక్షణాలోపంతో వృద్ధ మహిళలని కూడా చూడకుండా కొందరు జవాన్లు క్రూరత్వాన్ని చూపినట్టు తెలుస్తోంది. రోడ్లు ఊడ్చే మహిళా పీహెచ్ వర్కర్లను ట్రాక్టర్లపై ఎక్కించి చెత్త సేకరించాలని బలవంతం చేస్తున్నారు. రెండేళ్ల కిందట నగరంలోని ఖిలావరంగల్, హనుమకొండ, విష్ణుపురిలో ట్రాక్టర్ నుంచి మహిళా పారిశుధ్య కార్మికులు కిందపడి ప్రాణాపాయం నుంచి బయటపడ్డ ఘటనలున్నాయి. దీనిపై అప్పటి అధికారులు స్పందించి మహిళా కార్మికులకు ట్రాక్టర్లలో చెత్తసేకరణ విధుల నుంచి ఉపశమనం కలిగించారు. అయితే ప్రస్తుతం కొందరు జవాన్లు నాటి అధికారులు ఆదేశాలు విస్మరించి మహిళలకు ట్రాక్టర్ల డ్యూటీలు కేటాయిస్తూ.. ఒక వేళ ఈ విధులు నిర్వర్తించమని ఎవరైనా అంటే.. నెలకు రూ.2వేలు ఇస్తే ఈ పని నుంచి మినహాయిస్తామని కొందరు జవాన్లు వారితో బేరమాడుతున్నట్టు ఆరోపణలున్నాయి.



కావ్యకే టికెట్

ఉత్కంఠకు తెరదించిన కాంగ్రెస్ అధిష్ఠానం

- పార్టీలో చేరిన రెండు రోజుల్లోనే ఖరారైన అభ్యర్థిత్వం
- బీఆర్ఎస్‌ను తిరస్కరించి అనూహ్యంగా టికెట్ సొంతం
- పోటీపడ్డ కాంగ్రెస్ నేతలకు చుక్కెదురు.. పార్టీ శ్రేణుల్లో తీవ్ర నిరాశ

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 1: నెలరోజులుగా ఉత్కంఠ రేపిన వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనే అంశానికి తెర పడింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సోమవారం రాత్రి వరంగల్ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్యను అధికారికంగా ప్రకటించారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కడియం కావ్య రాజకీయ అరంగ్రేటంతోనే ఊహించనిరీతిలో లోక్‌సభ అభ్యర్థిగా బరిలో నిలిచారు. కడియం వర్గంలో ఈ పరిణామం ఆనందం నింపగా, మరోవైపు కాంగ్రెస్‌లోని ఆశావహులను తీవ్ర నిరాశకు గురి చేసింది. పార్టీ అధిష్ఠాన నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

పార్టీలో చేరిన రెండు రోజుల్లోనే..

రెండు రోజుల కిందటే కడియం శ్రీహరి, కావ్య హైదరాబాద్‌లో కాంగ్రెస్‌లో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకారం తీసుకొని ఆ తరువాత తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి సమక్షంలో కాంగ్రెస్ కండువాలను కప్పుకున్నారు. వరంగల్ లోక్‌సభ టికెట్ డిమాండ్‌తోనే శ్రీహరి, కావ్యలు పార్టీలో చేరారు. అయితే ఒక దశలో శ్రీహరి ఎమ్మెల్యే పదవిని వదులుకొని ఎంపీగా రంగంలో దిగుతారనే ప్రచారం జరిగింది. కానీ కూతురు కావ్యను ఎంపీగా బరిలో దింపే డిమాండ్‌తోనే శ్రీహరి కాంగ్రెస్ పెద్దలను ఆశ్రయించారు. మొత్తంగా శ్రీహరి వ్యూహం ఫలించి కావ్యకు టికెట్ దక్కింది. మొత్తంగా వరంగల్ లోక్‌సభ అభ్యర్థి ఎపిసోడ్‌కు

కడియం కావ్య బయోడేటా	
తండ్రి పేరు	: కడియం శ్రీహరి
తల్లి పేరు	: వినయరాణి
జన్మస్థలం	: హనుమకొండ
భర్త పేరు	: డాక్టరు ఎండీ నజీరుల్లా షేక్
సంతానం	: కూతుళ్లు దివ్య, మిహిరా
విద్యార్హతలు	: ఎంబీబీయస్, ఎండీ(పాథాలజీ)
వృత్తి	: అసిస్టెంట్ ప్రొఫెసర్ (ప్రతిమ రిలీఫ్ మెడికల్ కాలేజీ హనుమకొండ)

మిగతా 8వ పేజీలో..

వరంగల్ ప్రజలు ఆశీర్వదించండి..

- ఎంపీగా గెలిపిస్తే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కృషి
- ప్రజాశాంతి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ మంత్రి బాబుమోహన్

7



బీజేపీని అడ్డుకునేందుకే కాంగ్రెస్‌లో చేరా..

- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- మంత్రి సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజును కలిసిన కడియం

7



వరంగల్‌కు ప్రధాని మోదీ పెద్దపీట

- పలు స్కీమ్‌ల కింద వందల కోట్లు మంజూరు
- బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్

7



కేసీఆర్ కరువు యాత్ర ఓ డ్రామా...

- ఎర్రబెల్లి దయాకర్‌రావు స్క్రిప్ట్ మేరకే పర్యటన
- మీడియా సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

7





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

కేసీఆర్ పాలన.. దోపిడీ మయం

- విద్యుత్, నీటి ప్రాజెక్టుల్లో అక్రమాలు
- సీఎం విచారణకు ఆదేశించడంతో కేసీఆర్‌లో వణుకు
- అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

వరంగల్ సిటీ, ఏప్రిల్ 1: గత పదేళ్ల కేసీఆర్ పాలన దోపిడీమయమని, విద్యుత్, నీటి ప్రాజెక్టుల్లో ఎన్నో అక్రమాలు జరిగాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షలు చేసి గత ప్రభుత్వ దోపిడీపై విచారణకు ఆదేశించడంతో కేసీఆర్ ఒంట్లో వణుకు మొదలైందని అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. సోమవారం వరంగల్ ఓసిటీలోని క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల పాలనలో పట్టించుకోని కేసీఆర్.. పదవి పోగానే రైతులు గుర్తుకువచ్చారని ఎద్దేవా చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం చేపట్టిన పథకాలను తాను అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దు చేయడమేకాక, గిట్టుబాటు ధర అడిగిన రైతులకు బేడీలు వేసిన చరిత్ర కేసీఆర్‌దన్నారు. ఎంపీ ఎన్నికల్లో లబ్ధికోసమే కొత్తనాట మాడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 117 రోజులే అవుతుందని, కానీ కాంగ్రెస్ తప్పిదాల వల్లే కరువుకాలం వచ్చిందని ప్రచారం విడ్డూరంగా ఉందన్నారు. తాము అధికారంలోకి వచ్చాక వానాకాలమే రాలేదని, ఇది గుర్తించకపోవడం ఆయన అవివేకానికి నిదర్శమన్నారు. వంద రోజుల్లోనే ప్రభుత్వం ఐదు గ్యారెంటీలను అమలు చేస్తోందని దీన్ని బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారన్నారు. ఎన్నో హామీలను, పథకాలను తుంగలో తొక్కిన బీఆర్ఎస్ నేతలా తమకు నీతులు చెప్పేదంటూ మండిపడ్డారు. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసింది కేసీఆర్ అండ్ కో అన్నది జగమెరిగిన సత్యమని, కవిత లిక్కర్ స్కాం, కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్‌లు, సినీహీరోయిన్లను బ్లాక్‌మెయిల్ చేయడం అందరికీ తెలిసిందేనన్నారు. కుంభకోణాల్లో ఇరుక్కున్న చరిత్ర వారిదని, వారికి తమ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుల కోసం పెట్టిన పలు పథకాలు, ఇచ్చిన రాయితీలను ఎత్తేసి రైతుబంధు పేరుతో కలరింగ్ ఇచ్చారని దుయ్యబట్టారు. అవన్నీ గ్రహించే ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించి ఇంట్లో కూర్చోబెట్టారని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నికలలోపే బీఆర్ఎస్ ఖాళీ అయ్యే పరిస్థితి కనబడుతుంటే కేసీఆర్ అభద్రతాభావానికి గురవుతున్నారన్నారు.

ప్రాజెక్టుల డిజైనర్ కేసీఆర్.. అందుకే కూలిపోతున్నాయి..

కాళేశ్వరం, మేడిగడ్డ ఇతర నీటి ప్రాజెక్టుకు డిజైనర్ కే సీఆరేనని, ఆయనకు తోచిన విధంగా డిజైన్లు చేస్తే దాని ఫలితంకూడా అలాగే ఉందని, ఎప్పుడో కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్మించిన నాగార్జునసాగర్ ఇప్పటికీ చెక్కు చెదరలేదని, ఐదేళ్ల క్రితం కేసీఆర్ పాలనలో నిర్మించిన కాళేశ్వరం, మేడిగడ్డ మాత్రం నీటిని నిల్వ చేసే పరిస్థితి లేదని డ్యాం సేఫ్టీ అధికారులు చెపుతున్నారంటే ఎంత నాసిరకంగా కట్టారో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ప్రాజెక్టుల పేరుతో కమీషన్లకు కక్కుర్తి పడి ప్రజాసంపదను దోచుకున్నారన్నారు. కేటీఆర్‌కు పోయేకాలం దగ్గరపడ్డటుందని, ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణతో వారు చేసిన దందాలన్నీ బయటపడుతున్నాయన్నారు. ఇప్పటికే చెల్లి లోపటికి పోయిందని, తప్పులు చేసిన వారు ఎవరైనా ఫలితం అనుభవించక తప్పదన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, కడియం కావ్య పాల్గొన్నారు.

దొంగతోనే కండువా కప్పుకొంటివి..

- గతంలో రేవంత్‌రెడ్డిని దొంగ అన్న శ్రీహరి.. నైతిక విలువలుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి
- లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించండి..
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



వరంగల్ పార్లమెంట్ స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

రాంనగర్, ఏప్రిల్ 1: 'రేవంత్‌రెడ్డి ఓ మోసకారి, దొంగ అని గతంలో విమర్శలు చేస్తివి.. ఇప్పుడు ఆ దొంగతోనే కాంగ్రెస్ కండువా కప్పించుకుంటివి' అని ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే కడియం శ్రీహరిని ఉద్దేశించి మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత టి.హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. సోమవారం చింతగట్టు క్యాంపు వద్ద ఓ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ అధ్యక్షతన వరంగల్ లోక్‌సభ నియోజకవర్గస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన హరీశ్‌రావు మాట్లాడుతూ.. కడియం శ్రీహరి పార్టీని వీడాడ బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ మరింత పెరిగిందని, పార్టీకి ద్రోహం చేసిన వారికి గుణపాఠం చెప్పాలనే కసి ప్రతీ కార్యకర్తలో వచ్చిందన్నారు. ఆయనకు బీఆర్ఎస్ ఎంతో చేసిందని, నైతిక విలువలుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇక ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌వి ఉద్దెర వాగ్దానాలే తప్ప ఉద్ధరించిందేం లేదని ధ్వజమెత్తారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మినహా నిరుద్యోగ భృతి, రుణమాఫీ, కల్యాణలక్ష్మి తులం బంగారం, రైతుబంధు, రూ.4వేల పింఛనును సీఎం గాలికి వదిలేశాడని, రేవంత్‌రెడ్డివి తుపాకీరాముడి మాటలని దుయ్యబట్టారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ వైఫల్యాలను బీఆర్ఎస్ శ్రేణులు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడంలో భాగంగానే రాష్ట్ర అధికార చిహ్నం నుంచి కాకతీయ కళాతోరణం తొలగించాలనే నిర్ణయం తీసుకున్నారని,ఈ కళాతోరణం వరంగల్ ఆత్మగౌరవ ప్రతీకని, తొలగిస్తే వరంగల్ అగ్నిగుండమవుతుందని హెచ్చరించారు. ఇక బీజేపీ మాట వింటే జోడీ.. లేదంటే ఈడీ.. అని, నల్లధనం డబ్బులు వెలికితీసి ప్రతీ ఒక్కరి అకౌంట్లో రూ.15 లక్షలు వేస్తానని, ఏటా 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చి దశాబ్దకాలం అవుతున్నా బీజేపీ ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. దేవుడి పేరు చెప్పుకుని రాజకీయం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అందరికీ దేవుడంటే భక్తి ఉంటుందంటూ వేదికపైనే హనుమాన్ చాలీసా చదివారు. పార్టీని వీడిన వారిని తిరిగి చేర్చుకునే ప్రసక్తే లేదన్న ఆయన ఉద్యమకారులకు అవకాశాలు కల్పిస్తామని, మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని శ్రేణులకు భరోసానిచ్చారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. పైరవీకారులు, బ్రోకర్లు పార్టీని వీడుతున్నారని మండిపడ్డారు. కడియం కూతురుకు ఎంపీ టికెట్ ఇస్తే మూడో స్థానంలో వస్తుందని తాను కేసీఆర్‌కు చెప్పానని, అయినా అందరినీ కాదని ఇస్తే పార్టీ మారడం ఎంతవరకు సమంజసమన్నారు. కడియం ఈ స్థాయిలో ఉండటానికి తానే కారణమని.. నాడు ఎన్టీఆర్‌కు చెప్పి ఎమ్మెల్యే, మంత్రి పదవులు ఇప్పించానని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో కడియం ఉన్నా, ఆయన కూతురు ఉన్నా ఓడించడంలో ముందుంటానని దయాకర్‌రావు పేర్కొన్నారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ పార్టీ మారిన కడియం శ్రీహరిపై అనర్హత వేటు కోసం పార్టీ పక్షాన స్పీకర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఎమ్మెల్సీ మధుసూధనాచారి మాట్లాడుతూ కూతురును అడ్డుపెట్టుకుని కడియం శ్రీహరి రాజకీయం చేస్తున్నాడని, ఆయనకు తగిన గుణపాఠం తప్పదన్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కడియం శ్రీహరి లాంటి ముసలోళ్లు పోయినంత మాత్రాన పార్టీకి నష్టం లేదని, తమతో కావ్యను గెలిపించాలని చెప్పి.. తెల్లారే ప్లేట్ ఫిరాయించాడని ఆరోపించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడు నెలలుగా కడియం శ్రీహరి పార్టీ మారేందుకు ప్రయత్నిస్తతన్నాడని, బీఆర్ఎస్‌కు ద్రోహం చేసిన కడియం చస్తే.. ఆయన ముగ్గురు బిడ్డలు మాత్రమే పాడె మోయాల్సి వస్తుందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నీతి గురించి చెప్పే కడియం.. దేవునూరులో భూమి ఎలా కొన్నాడో.. ఇల్లు ఎలా కట్టాడో అందరికీ తెలుసన్నారు. నాడు ఎన్టీఆర్, చంద్రబాబుకు ఈరోజు కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచాడని

మిగతా 8వ పేజీలో..

ఎంపీ అభ్యర్థి ఎంపికపై సమాలోచనలు

- ఎర్రబెల్లి నివాసంలో నేతలతో హరీశ్‌రావు భేటీ

6

సోమవారం ఉష్ణోగ్రతలు	
గరిష్ఠం : 39.0°C	కనిష్ఠం : 22.5°C

రంజాన్ వేళలు		
ఇఫ్తార్ :	మంగళవారం	సా : 6.35 గం..
సహర్ :	బుధవారం	ఉ : 4.46 గం..

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 1: వేసవికాలంలో తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ప్రతి రోజు తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి తాగునీరు, ధాన్యం కొనుగోళ్లు, పాఠశాలల్లో మౌలిక వసతులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ పక్కా ప్రణాళికతో తాగునీటి సరఫరా చేపట్టాలన్నారు. మిషన్‌భగీరథ ద్వారా అందుబాటులో ఉన్న వ్యవస్థను పూర్తిస్థాయిలో వినియోగించాలని, అత్యవసర పరిస్థితుల్లో వ్యవసాయ మోటార్లను వినియోగించి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని సూచించారు. వరి కోతలు జరుగుతున్న నేపథ్యంలో అవసరమైన మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి ధరపై కొనుగోలు చేయాలని ఆదేశించారు. 2023-24కు సంబంధించి సీఎంఆర్ డెలివరిని వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, నిరుపయోగంగా ఉన్న మరుగు దొడ్లను ఉపయోగంలోకి తీసుకురావడం, అదనపు మరుగుదొడ్ల నిర్మాణం, చిన్ని చిన్న మరమ్మతులు, విద్యుత్ సౌకర్యం వంటి పనులను పూర్తి చేయాలని సీఎస్ తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఈవో వాసంతి, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, డీపీఓ ఉషాదయాల్, డీసీవో సంజీవరెడ్డి, డీపీఓ కల్పన, మునిసిపల్ కమిషనర్లు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

శిక్షణను ఎన్నికల సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలి

- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 1: ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. లోక్‌సభ ఎన్నికల్లో విధుల్లో పాల్గొనే సిబ్బందికి హనుమకొండ ములుగురోడ్‌లోని ఎల్‌బీ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని సోమవారం కలెక్టర్ సందర్శించి సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ వర్ధన్నపేట, పరకాల, స్టేషన్ ఘనపూర్, పాలకుర్తి, భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈనెల 6వ తేదీ వరకు నిర్దేశిత కేంద్రాల్లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇతర అధికారులకు తొలి విడత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. వరంగల్ తూర్పునకు 894 పోలింగ్ సిబ్బందిని కేటాయించి ఎల్‌బీ కళాశాలలో మూడు రోజులపాటు బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని, ఎన్నికల సంఘం రూపొందించిన నియమావళిపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. పోలింగ్ సందర్భంగా నిర్వహించాల్సిన విధుల్లో నిర్లక్ష్యం వహించరాదన్నారు. శిక్షణకు గైర్హాజరు కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. రెండో సెషన్‌లో వీవీ ప్యాట్‌లపై సిబ్బందికి ప్రయోగాత్మకంగా ఇస్తున్న శిక్షణ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కోసం అందించిన ఫారం 12ను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి బాలకృష్ణ, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, కుడా పీవో అజిత్‌రెడ్డి, మాస్టర్ ట్రేనీ కృష్ణ, డి.శ్రవణ్ కుమార్, కనకయ్య, వాసు, నాగార్జున పాల్గొన్నారు.



శిక్షణ సందర్భంగా మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

ఎంపీ అభ్యర్థి ఎంపికపై సమాలోచనలు

ఎర్రబెల్లి నివాసంలో నేతలతో హరీష్‌రావు భేటీ

రాంనగర్, ఏప్రిల్ 1: వరంగల్ లోక్‌సభ అభ్యర్థి ఎంపికపై మాజీ మంత్రి హరీష్‌రావు వరంగల్ నేతలతో సమాలోచనలు చేశారు. సోమవారం నగరంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ సమావేశంలో పాల్గొన్న హరీష్‌రావు హనుమకొండలోని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాసంలో వరంగల్ లోక్‌సభ పరిధిలోని నేతలతో భేటీ అయ్యారు. బీఆర్‌ఎస్ నుంచి బలమైన అభ్యర్థిని బరిలో నిలపాలని నిర్ణయించి జిల్లా నేతలతో చర్చించారు. వరంగల్ అభ్యర్థిత్వం కోసం నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి పెద్ది స్వప్నతోపాటు పార్టీని వీడిన డాక్టర్ రాజయ్య పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. రాజయ్యతో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. ఆయనను తిరిగి పార్టీలోకి తీసుకునేది ఖరారు కాలేదు.

కాగా, పెద్ది స్వప్నవైపు పలువురు నేతలు మొగ్గు చూపినట్లు తెలిసింది. పెద్ది సుదర్శన్‌రెడ్డికి ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా మంచి పేరు ఉండటంతో స్వప్నకు టికెట్ ఇస్తే కలిసివచ్చే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమైనట్లు తెలిసింది. స్వప్న ఎస్సీ సామాజికవర్గం మద్దతుతో పాటు భర్త పెద్ది సామాజికవర్గమైన ఓసీల మద్దతు లభించే అవకాశం ఉంటుందనే విషయాన్ని నేతలు హరీష్‌రావు దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిసింది. పెద్ది సుదర్శన్‌రెడ్డి సైతం తన సతీమణికి అవకాశం ఇవ్వాలని అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. వీరితోపాటు ఉద్యమకారులు బోడ డిన్నా, జోరిక రమేశ్, వీరేందర్, నిరంజన్, సిరిమల్ల సదానందం, విక్టర్‌బాబు, బండి రజనీకుమార్, చింతల యాదగిరి సైతం తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. వీరు మాజీ మంత్రి హరీష్‌రావును కలిసి తమలో ఒకరికి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారులతో ప్రత్యేక భేటీ అయిన హరీష్‌రావు.. అధిష్ఠానం ప్రకటించిన అభ్యర్థికి మద్దతు తెలపాలని కోరారు. ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించేలా చూస్తామని ఆయన తెలిపారు. సుదీర్ఘంగా చర్చించిన హరీష్‌రావు.. అధిష్ఠానంతో మాట్లాడి ఒకటిరెండు రోజుల్లో అభ్యర్థిని ఖరారు చేద్దామని నేతలకు తెలిపినట్లు సమాచారం.

నలుగురు భూ కబ్జాదారుల అరెస్టు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 1: నకిలీ పత్రాలు సృష్టించి భూ కబ్జాకు యత్నించిన నలుగురిపై కేసు నమోదు చేసిన కేయూ పోలీసులు.. సోమవారం వారిని అరెస్టు చేశారు. ఎస్ఐ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పారుపాటి శ్రీదేవితోపాటు మరో ఆరుగురు వ్యక్తులు 15 యేళ్ల కిందట కోమటిపల్లి శివారులో స్థలం కొనుగోలుచేసి పర్మిషన్‌లు తీసుకుని షెడ్లు వేసుకుని కబ్జాలో ఉంటున్నారు. కిందటేడు శివప్రసాద్ అనే వ్యక్తి ఈ స్థలం కబ్జా చేసేందుకు యత్నించగా కేసు పెట్టారు. శివప్రసాద్ నుంచి స్థలం తీసుకున్నట్లు పేపర్లు సృష్టించిన హైదరాబాద్‌కు చెందిన ఘట్టమనేని సతీష్‌చంద్రతోపాటు వరంగల్ నగరానికి చెందిన కర్నే వేణు, గూగుల్ నరేష్, కారం ప్రభాకర్‌లు కబ్జా చేసే ప్రయత్నం చేశారు. 15 యేళ్ల కిందట కొనుగోలు చేసిన వారిని బెదిరింపులకు గురిచేసి వారు నిర్మించుకున్న షెడ్లను నేలమట్టం చేసి స్థలం చదును చేశారు. ఈ స్థలం వేరే వ్యక్తులకు అమ్మడానికి ప్రయత్నిస్తున్నారు. పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు నకిలీపత్రాలు సృష్టించి కబ్జాకు యత్నించిన నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కాగా, ఈ నలుగురు భూకబ్జాదారులుగా గుర్తించి రౌడీషీట్లు ఓపెన్ చేశారు.

నేడు మందబుద్ధిపై అవగాహన సదస్సు

వడ్డెపల్లి, ఏప్రిల్ 1: హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో ప్రపంచ మందబుద్ధి (ఆటిజం)పై అవగాహన సదస్సును మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్లు మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకురాలు బండ రామలీల తెలిపారు. సోమవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల విద్యార్థులు, మానసిక దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొనాలని ఆమె కోరారు.

వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ఆశీర్వదించండి

ఎంపీగా గెలిపిస్తే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కృషి : ప్రజాశాంతి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ మంత్రి బాబుమోహన్

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 1: వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రజాశాంతి పార్టీ నుంచి బరిలో నిలుస్తున్న తనను వరంగల్ ప్రజలు ఆశీర్వదించి విజయం కట్టబెట్టాలని ప్రజాశాంతి పార్టీ లోక్‌సభ అభ్యర్థి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీమంత్రి బాబుమోహన్ కోరారు. సోమవారం హనుమకొండ ములుగురోడ్‌లోని ఓహోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాబుమోహన్ పాల్గొని మాట్లాడారు. ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్ ఆశీస్సులతో త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ నుంచి వరంగల్ లోక్‌సభ బరిలో ఉంటానన్నారు. ప్రజాశాంతి పార్టీ తరఫున కేఏ పాల్ విశాఖపట్నం లోక్‌సభ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నాడని, అక్కడికి తనను పిలిపించి శాలువా కప్పి ప్రజాశాంతి పార్టీలోకి అహ్వానించారన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా, వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించారన్నారు. వరంగల్ బిడ్డగా, 25 యేళ్ల రాజకీయ అనుభం కలిగిన తనను వరంగల్ ప్రజలు లోక్‌సభకు ఆశీర్వదించి పంపితే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కృషి చేస్తానన్నారు.

లోక్‌సభ అభ్యర్థిగా విజయం కట్టబెడితే ప్రజాశాంతి పార్టీ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్య, వైద్యంతోపాటు వితంతువులకు, వృద్ధులకు పెన్షన్లను కేఏ పాల్ సొంత నిధులతో అందిస్తామని బాబుమోహన్ హామీ ఇచ్చారు. ప్రపంచ దేశాల అధ్యక్షుల మన్ననలు పొందిన వ్యక్తిగా, సేవాగుణం కలిగిన వ్యక్తిగా, రాష్ట్రానికి పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలకు తీసుకవచ్చిన గొప్ప మేధావి అయిన కేఏ పాల్ పట్ల కొందరు వక్తలు తప్పుడు కూతలు కూయడం సరికాదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ లాగా అబద్ధాలు చెప్పడంగానీ, మోసాలకు పాల్పడటం తెలియని వ్యక్తి కేఏ పాల్ అని కొనియాడారు. కేసీఆర్‌తో తాను టచ్‌లో ఉన్నానని కొందరు పుట్టిస్తున్న పుకార్లు అవాస్తవమని, తాను ఎవరికో కొమ్ముకాస్తున్నానని వస్తున్న ఆరోపణలు సరికాదన్నారు. తనను కొనే మొనగాడు ఈ భూమి మీద ఇంకా పుట్టలేదన్నారు. చౌకబారు రాజకీయలు చేయకుండా నిజాయితీతో కూడిన రాజకీయలు చేయాలని హితవు పలికారు.


హనుమకొండలో మీడియాతో మాట్లాడుతున్న బాబుమోహన్

25 యేళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ కాంట్రాక్టులు, అవినీతి, అక్రమాలకు, కబ్జాలు పాల్పడలేదన్నారు. మాజీ సీఎం ఎన్‌టీఆర్ ఆశీస్సులతో రాజకీయ అరంగ్రేటం చేశానన్నారు. వరంగల్ గడ్డపై పుట్టి ఖమ్మంలో పెరిగి సినిమా ఇండస్ట్రీలో అంచెలంచెలుగా ఎదిగి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చానన్నారు. గతంలో ముక్కు, మొఖం తెలియని జిల్లాలో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా అక్కడి ప్రజలకు విశేష సేవలు, అభివృద్ధి పనుల చేసిన తాను.. జన్మనిచ్చిన జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. లోక్‌సభ బరిలో నిలుస్తున్న తనను వరంగల్ ప్రజలు పెద్ద మనస్సుతో దీవించి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సింగారపు సుజాత , పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, తరాల శంకర్, ఆర్ల శంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్‌కు ప్రధాని మోదీ పెద్ద పీట

బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 1: వరంగల్ అభివృద్ధికి వందల కోట్ల నిధులు కేటాయించి దేశంలోనే వరంగల్‌కు ప్రధాని మోదీ పెద్దపీట వేశాడని బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. వరంగల్ లోక్‌సభ సీటు గెలుపు కోసం ఏవిధంగా సిద్ధం కావాలనే అంశంపై పశ్చిమ నియోజకర్గంలోని బూత్‌స్థాయి నాయకులతో సోమవారం హంటర్‌రోడ్డులో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆరూరి రమేశ్ మాట్లాడుతూ.. 2014 కంటే ముందు తెలంగాణలో 2,511 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు ఉంటే.. మోదీ 9 ఏళ్ల పాలనలోనే 2,500 కిలోమీటర్ల జాతీయ రహదారులు నిర్మించారని గుర్తు చేశారు. మరో 2,269 కిలోమీటర్ల జాతీయ రహదారులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. స్మార్ట్‌సిటీ ద్వారా వరంగల్ నగరంలో మెరుగైన సదుపాయాల కోసం రూ.2,500 కోట్ల నిధులు మోదీ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. హెరిటేజ్ సిటీ కింద రూ.32కోట్లను విడుదల చేశారన్నారు.

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన స్కీమ్‌లో భాగంగా వరంగల్‌కు 7,096 ఇళ్లను మంజూరు చేశారన్నారు. అమృత్ పథకం కింద 273.58కోట్ల నిధులను ఇచ్చారన్నారు. ఆదర్శ రైల్వేస్టేషన్స్‌లో భాగంగా వరంగల్ రైల్వేస్టేషన్ ఆధునీకరించడం, కాజీపేట నుంచి విజయవాడకు మూడో లైన్ పనులను చకాచకా జరుగుతున్నాయన్నారు. రూ.521కోట్లతో నిర్మించబోతున్న రైల్వే తయారీ యూనిట్ ద్వారా ఎంతోమందికి ఉపాధి లభించబోతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కిరోసిన్‌తో దీపాలు వెలిగించుకొని జీవితాలు వెళ్లదీసేదని, అలాంటిది మోదీ ప్రభుత్వంలో ప్రధానమంత్రి సౌభాగ్య యోజన స్కీమ్‌లో భాగంగా తెలంగాణలో ఐదు లక్షల 15వేల విద్యుత్ కనెక్షన్‌లను ఇచ్చారని అరూరి అన్నారు. కాకతీయులు నిర్మించిన వారసత్వ సంపదకు యునెస్కో గుర్తింపు రావడానికి మోదీ కృషి మరువలేనిదన్నారు. అన్నీ విధాలుగా వరంగల్‌ను అక్కున చేర్చుకున్న మోదీ నాయకత్వాన్ని వరంగల్ బలపర్చాలని కోరారు.


పశ్చిమ నియోజకవర్గ బూత్ స్థాయి నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న అరూరి రమేశ్

బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. 1984లో వరంగల్ వచ్చిన ఫలితాలే మళ్లీ పునరావృతం అవుతాయన్నారు.

ఈ సమావేశంలో హనుమకొండ లోక్‌సభ నియోజకవర్గ ప్రభారీ డాక్టర్ వి.మురళీధర్‌గౌడ్, పార్టీ క్రమశిక్షణ సంఘం కమిటీ ఛైర్మన్ ధర్మారావు, మాజీ ఎమ్మెల్యేలు కొండేటి శ్రీధర్, శ్రీరాములు, రాష్ట్ర నాయకులు ఆర్.కిషన్, సీహెచ్. శ్రీనివాస్‌రెడ్డి, డి.దేవేందర్ రెడ్డి, కార్పొరేటర్లు ఆర్.కోమల, బి.లక్ష్మీ, సీహెచ్. స్వాతి, డి.అభినవ్ భాస్కర్, జి.వసంత, జిల్లా నాయకుడు కొలను సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ వార్షిక ఆదాయం

రాంనగర్, ఏప్రిల్ 1: జిల్లా రిజిస్ట్రేషన్ శాఖకు ఆస్తుల రిజిస్ట్రేషన్‌ల ద్వారా కిందటేడు కంటే ఎక్కువ ఆదాయం వచ్చింది. కిందటేడు (2022-23) ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 కార్యాలయాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్లకు సంబంధించి 103646 డాక్యుమెంట్స్ కాగా ఫీజు రూపేనా రూ.404కోట్ల 42లక్షల 93వేల ఆదాయం రాగా, ఈవార్షిక సంవత్సరం (2023-24) 106016 డాక్యుమెంట్లు కాగా ఫీజు రూపేనా రూ.415కోట్ల 63 లక్షల 61వేలు ఆదాయం సమకూరింది. గత సంవత్సరం కంటే రూ.11కోట్ల 20లక్షల 68వేలు ఆదనంగా ఆదాయం వచ్చింది. ఈ యేడు 13 కార్యాలయాల్లో హనుమకొండ వడ్డెపల్లి జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అత్యధికంగా 29557 డాక్యుమెంట్‌లు నమోదు కాగా రూ.201కోట్ల 22లక్షల 18వేల ఆదాయం రావడం విశేషం. ఈ యేడు వచ్చిన ఆదాయంలో సగం జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి రావడం గమనార్హం.

ఒడిస్సా కూలీ మృతి

బయ్యారం, ఏప్రిల్ 1:జీవనోపాధి నిమిత్తం ఒడిస్సా రాష్ట్రం నుంచి వలస వచ్చిన ఓ కూలీ అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన బయ్యారం మండలం కాచనపల్లి ఇటుక బట్టీలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రం నవరంగ్ జిల్లా కందిగూడ గ్రామానికి చెందిన బోయి సంపత్ (56) నెల కిందట ఇటుక బట్టీలో దినసరి కూలీగా పనిచేసేందుకు కొందరు కూలీలతో బయ్యారం మండలం వచ్చాడు. కాచనపల్లి సమీప ఓ ఇటుక బట్టీ నందు పనిలో చేరిన సంపత్.. తోటి కూలీలతో కలిసి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే సంపత్ బట్టీలో ఆదివారం రాత్రి భోజనం చేసి నిద్రించాడు. తెల్లవారుజామున తోటి కూలీలు చూసే సరికి సంపత్ మృతి చెంది ఉన్నాడు. సంపత్ ఎలా మృతి చెందాడనదే ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. కానీ బట్టీ యజమాని మాత్రం సంపత్‌ది సహజ మరణమేనని పేర్కొంటున్నాడు. సంపత్ కొంత మద్యం సేవించి నిద్రించినట్లు బట్టీ యజమాని వెల్లడించారు. అటవీ ప్రాతంలో గల బట్టీలో నిద్రించడంతో ఏదైన విష పురుగు కుట్టి చనిపోయాడా.. లేక మద్యం సేవించిన మత్తులో నిద్రించి దాహార్తికి లోనై మృతి చెంది ఉంటాడా.. అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

యువకుడిపై దాడి కేసులో ఏడుగురి అరెస్టు

కొత్తగూడ, ఏప్రిల్ 1 : కొత్తగూడ మండలం పొగుళ్లపల్లిలో యువకుడిపై దాడి చేసిన ఘటనలో ఏడుగురిపై కేసు నమోదుచేసి అరెస్టు చేశారు. కొత్తగూడ మండలం చిట్యాలగడ్డకు చెందిన వంకాయల కార్తీక్ అనే యువకుడిని ఈ నెల 19న పొగుళ్లపల్లిలో తొమ్మిది మంది కలిసి విచక్షణ రహితంగా దాడి చేశారు. కార్తీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొమ్మిదిమందిపై అపహరణ, గాయపరిచిన, కు లం పేరుతో దూషించినందుకు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. మహ బూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు సోమవారం పొగుళ్లపల్లికి చేరుకుని విచారణ చేప ట్టారు. అనంతరం కేసు నమోదైన గద్ద అశోక్, ఎటుకూరి హరీష్, చవ్వ శివ, వట్టం నాగరాజు, గుగ్గిళ్ల నర్సయ్య, బైరబోయిన అశోక్, గాజుల వెంకటేశ్వర్లులను అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఎస్సై దిలీప్ తెలిపారు.


కొండా దంపతులను వారి నివాసంలో కలిసిన కడియం శ్రీహరి, కావ్య

బీజేపీని అడ్డుకునేందుకే కాంగ్రెస్ పార్టీలో చేరా..

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 1: మతోన్మాద బీజేపీ ఆగడాలను అడ్డుకునేందుకే కాంగ్రెస్‌లో చేరినట్లు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెల్లడించారు. దేశవ్యాప్తంగా మైనారిటీలు, దళితులపై జరుగుతున్న దాడులను అడ్డుకోవడానికి కాంగ్రెస్ పోరాడుతోందన్నారు. లౌకికవాద పరిరక్షణ కోసం పార్టీలో చేరానన్నారు. హనుమకొండ సుబేదారిలోని ఎమ్మెల్యే నాగరాజును ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం కూతురు కావ్యతో కలిసి మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంతి రేవంత్‌రెడ్డి పాలన ప్రజాదరణ పొందుతోందన్నారు. స్వేచ్ఛ కోసం కాంగ్రెస్‌లోకి వచ్చినట్లు చెప్పారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచనతో కూడా కాంగ్రెస్‌లో చేరినట్లు చెప్పారు. మిగతా వివరాలు త్వరలో వివరంగా తెలియచేస్తానని మీడియా ప్రశ్నలకు బదులిచ్చారు. కడియం కావ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో చేరిన తదుపరి ఎమ్మెల్యేలను కలవాలనే ఉద్దేశంతో వచ్చినట్లు చెప్పారు. ప్రత్యక్ష ఎన్నికల్లో మాట్లాడే అవకాశం తనకు ఇంకా రాలేదని, వచ్చాక చెబుతానంటూ మీడియా ప్రశ్నలకు కావ్య సమాధానంగా చెప్పారు. కాగా, అంతకుముందు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆయన కూతురు కావ్య కలిశారు. సోమవారం ఇద్దరు ఎమ్మెల్యేలను వారి వారి నివాసాల్లో వేరు వేరుగా కలిశారు.

కొండా దంపతులను కలిసిన కడియం శ్రీహరి, కావ్య

వరంగల్ సిటీ: కాంగ్రెస్ పార్టీలో ఇటీవల చేరిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కడియం కావ్య సోమవారం హనుమకొండ రాంనగర్‌లోని అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుల నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, ప్రస్తుత రాజకీయా పరిస్థితులపై చర్చించారు. అలాగే, పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ స్థానాన్ని గెలిపించుకునేందుకు వ్యూహాలపై చర్చించుకున్నారు. తొలిసారి కడియం శ్రీహరి, కావ్య తమ నివాసానికి వచ్చినందున కొండా దంపతులు నూతన వస్త్రాలతో సత్కరించారు.

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి సురేఖ

వరంగల్ కల్చరల్: వేములవాడ రాజరాజేశ్వర స్వామిని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ దర్శించుకున్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం సోమవారం తొలిసారిగా వేములవాడ కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తన మనవడి పేరుమీద కోడె మొక్కును చెల్లించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని స్వామిని ప్రార్థించినట్లు మంత్రి చెప్పారు. అనంతరం బద్దిపోచమ్మ ఆలయంలో పూజలుచేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.


మంత్రి కొండా సురేఖకు స్వామివారి ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

కేసీఆర్ కరువు యాత్ర ఓ డ్రామా..

● దయాకర్‌రావు స్క్రిప్ట్ మేరకే పర్యటన ● మీడియా సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 1: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కరువు యాత్ర ఓ డ్రామా అని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు విమర్శించారు. డ్రామాకు సంబంధించిన స్క్రిప్ట్ అంతా మాజీ మంత్రి దయాకర్ రావు సిద్ధం చేసి కేసీఆర్‌తో మాట్లాడించారని ఆరోపించారు. సోమవారం హనుమకొండ సుబేదారిలోని క్యాంపు కార్యాలయంలో నాగరాజు కేసీఆర్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. కుంభకర్ణుడు నిద్రలేచినట్లు కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి రైతుల వద్దకు వచ్చారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ రైతులను పట్టించుకోని కేసీఆర్‌కు ఇప్పుడు రైతులు గుర్తుకు రావడం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్‌పాలన ఇంకా నాలుగు నెలలు కూడా పూర్తి కాక ముందే కేసీఆర్ అభాండాలు వేస్తున్నారని దుయ్యబట్టారు. వర్షాకాలం రాక ముందే సీఎం రేవంత్ రెడ్డి పాలనలో కరువు వచ్చిందంటూ వ్యాఖ్యలు చేయడం కేసీఆర్‌కు మతిభ్రమించినట్లు అర్థమవుతోందని అన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని చెబుతున్న కేసీఆర్.. వాస్తవాలతో నిరూపించాలని డిమాండ్ చేశారు. లేకుంటే తరిమికొడతామని హెచ్చరించారు. రైతుల బతుకులను ఛిద్రం చేసింది కేసీఆర్ అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో రైతులు దిక్కుతోచని స్థితికి గురయ్యారన్నారు. ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకున్నారని మండిపడ్డారు. రైతుబంధును బూచిగా చూపి రైతులకు సంబంధించిన అనేక సంక్షేమ పథకాలను హరించారని ఆరోపించారు. రైతుబంధు పేరుతో కేసీఆర్ దోపిడీ చేశారన్నారు. ఈ క్రమంలో అర్హత గల రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో రేవంత్‌రెడ్డి భూస్వాములకు రైతుబంధు వర్తించకుండా పరిమితులు విధించి అమలు చేయాలనే ప్రణాళికతో ఉన్నారన్నారు. నాలుగు నెలల కాంగ్రెస్‌పాలనలో విద్యుత్, నీటిసరఫరా నిరంతరాయంగా జరుగుతుందన్నారు.


కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ పాలన స్కామ్‌లమయంగా సాగిందని నాగరాజు ఆరోపించారు. కాళేశ్వరం భారీ కుంభకోణమన్నారు. దేశచరిత్రలోనే ఇంతటి కుంభకోణం మరొకటి లేదన్నారు. కేవలం దోచుకోవడానికే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి కేసీఆర్ స్కెచ్ వేశారన్నారు. నిపుణులు డిజైన్ విషయంలో ఎంతగావారించినా 80 వేల పుస్తకాలు చదివిన మేధావి కేసీఆర్ వినలేదని విమర్శించారు. మిషన్‌కాకతీయ పేరిట చెరువుల పూడికతీత చేపట్టిన కేసీఆర్.. వాటి ఫలితాలను క్షేత్రస్థాయిలో చూపించాలని డిమాండ్ చేశారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రైతుబంధు ఇలా.. ప్రతీదానిలో కేసీఆర్ దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. కూతురు కవిత లిక్కర్ స్కాం, కేసీఆర్ కాళేశ్వరం కుంభకోణం, కుమారుడు మాజీ మంత్రి కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం.. ఇలా కేసీఆర్ కుటుంబం అక్రమాలు తెలంగాణ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశాయన్నారు. అక్రమాలు బయటపడుతుండడంతో కేసీఆర్ మతిభ్రమించి కరువు యాత్రలో కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని నాగరాజు పేర్కొన్నారు. గడీల తలుపులు బద్దలు కొట్టి ప్రజాపాలనకు ద్వారాలు తెరిచారన్నారు. కడియం శ్రీహరి, ఆయన కూతురు కావ్యల చేరికపై మీడియా ప్రశ్నలకు సమాధానమిస్తూ.. అధిష్ఠానం అన్ని కోణాల్లో ఆలోచించే నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఈ సమావేశంలో డీసీసీ బ్యాంకు ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు, కిసాన్ సెల్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శేఖర్ రావు, కిసాన్ సెల్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్‌రావుతోపాటు మహేందర్, వీసం సురేందర్‌రెడ్డి, తిరుపతి, బుచ్చిరెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాంపల్లిలో భూ వివాదంలో ఘర్షణ

● భార్యాభర్తలు, కొడుకుపై హత్యాయత్నం ● గొడ్డలి, కర్రలతో దాడి.. తీవ్రగాయాలు

సీరోలు, ఏప్రిల్ 1: సీరోలు మండలం కాంపల్లి గ్రామంలో సోమవారం రెండు కుటుంబాల మధ్య చోటుచేసుకున్న భూ వివాదం ఘర్షణకు దారితీసింది. ఇందులో దంపతులు, వారి కుమారిడిపై ప్రత్యర్థులు కర్రలు, గొడ్డల్లతో దాడిచేయడంతో వారు తీవ్రంగా గాయపడి జిల్లా ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నారు. బాధితుల కథనం ప్రకారం...కాంపల్లి గ్రామంలో రేపాల కృష్ణ, రేపాల వెంకటనారాయణ కుటుంబాల మధ్య గత కొంత కాలంగా భూవివాదం కొనసాగుతోంది. గ్రామ సమీపంలోని మహబూబాబాద్-ఖమ్మం ప్రధాన రహదారి పక్కన ఉన్న రేపాల కృష్ణ వ్యవసాయ భూమిలో అదే గ్రామానికి చెందిన రేపాల వెంకటనారాయణ, వెంకన్న ఉపేందర్, పెద్ద సత్యంలు కృష్ణ భూమిలో రాళ్లు పాతేందుకు యత్నిస్తుండగా తమ భూమిలో రాళ్లు ఎందుకు పాతుతున్నారని వారిని అడుగగా ఘర్షణ చోటుచేసుకుంది. ఇది నీ భూమి కాదు మా భూమిలో రాళ్లు పాతుకుంటే నీవెవరు అడ్డుకోవడానికి అంటూ కృష్ణతో వాగ్వివాదానికి దిగారు. ఈ క్రమంలో వారి వెంట తెచ్చుకున్న గొడ్డల్లు, కర్రలు, గడ్డపారలతో కృష్ణ కుమారుడు అశోక్‌పై దాడి చేస్తుం డగా అడ్డువచ్చిన తల్లి బిక్షమమ్మపై కూడా దాడి చేశారు. . తల్లిని కాపాడేందుకు ప్రయత్నించిన అశోక్‌పై దాడిచేస్తుండగా పక్కనే వరి పొలం కోయిస్తున్న తండ్రి రేపాల కృష్ణ అక్కడికి చేరుకోగానే ముగ్గురిపై ప్రత్యర్థులు దాడి చేశారు. గొడ్డలితో తలపై నరకడంతో తీవ్రగాయమై రక్తస్రావంతో కుప్పకూలిపోవడంతో చుట్టుపక్కల వారు వెంటనే. 108కు సమాచారం ఇచ్చారు. 108 వాహనంలో ఆ ముగ్గురిని మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తండ్రి కృష్ణ పరిస్థితి విషమంగా ఉందని భార్య బిక్షమమ్మ కుమారుడు అశోక్, తెలిపారు. ఈ విషయంపై సీరోలు ఎస్సై విజయ్ రాంకుమార్‌ను వివరణ కోరగా బాధతుడి కూతురు యశోద ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



ఘర్షణలో గాయపడిన రేపాల కృష్ణ, రేపాల అశోక్



పూర్వవిద్యార్థుల సమ్మేళనం

గీసుగొండ, ఏప్రిల్ 1: గీసుగొండ జెడ్పీ పాఠశాలలో పూర్వ విద్యార్థుల(1991-92 టెన్త్ బ్యాచ్) ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థులు గత స్మృతులను పంచుకున్నారు. నాటి హెడ్మాస్టర్, రిటైర్డ్ డిప్యూటీ డీఈవో ఇరుకుళ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్య, విజ్ఞానం, క్రమశిక్షణను విద్యార్థులకు అందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు సయ్యద్ అలీ అక్బర్, రమణాచారి, దశరథం, దేవేంద్రాచారి, మోహన్‌రెడ్డి, జ్ఞానకుమారి, సత్యనారాయణ నిర్వాహక కమిటీ కన్వీనర్ కర్ణకంటి రామ్మూర్తి, పాల్గొన్నారు.



మహిళా పోలీసు కానిస్టేబుళ్లతో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝ

మహిళా పోలీసుల పాత్ర ఎంతో కీలకం: సీపీ

సంగెం, ఏప్రిల్ 1: విధి నిర్వహణలో మహిళా పోలీసుల ప్రాత ఎంతో కీలకమైనదని వరంగల్ నగర పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝ అన్నారు. మామునూరు పోలీసు శిక్షణ కళాశాలలో సివిల్ మహిళా పోలీసులుగా శిక్షణ పొందుతున్న 306మంది మహిళా కానిస్టేబుళ్లు సోమవారం హనుమకొండలోని పోలీసు కమిషరేట్‌ను సందర్శించి పరిశీలించారు. పోలీసు శిక్షణ కళాశాల శిక్షణ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అడిషనల్ ఎస్పీ రాగ్యనాయక్ ఆధ్వర్యంలో మహిళా పోలీసు కానిస్టేబుల్ మౌళిక శిక్షణలో భాగంగా సందర్శించారు. కమిషనరేట్‌లో వివిధ విభాగాల్లో పోలీసులు పనిచేసే పని తీరును శిక్షణార్థులు పరిశీలించారు. కార్యక్రమంలో పోలీసు శిక్షణ కళాశాల అసిస్టెంట్ కమాండెంట్ మన్నె భిక్షపతి, పోలీసు అధికారులు చంద్ర శేఖర్, ఆర్ఎస్ఐల రాజేష్, అనిల్, అశోక్, శ్రీహరి, సంజీవ పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా చూద్దాం..

వరంగల్ క్రైం, ఏప్రిల్ 1: పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి లోక్‌సభ ఎన్నికలు సజావుగా జరిగేలా చూద్దామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అధికారుల పని తీరుపై క్రైం సమావేశంతోపాటు లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై పోలీస్ కమిషనర్ సెంట్రల్, ఈస్ట్‌జోన్‌కు చెందిన పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముందుగా స్టేషన్‌ల వారిగా పెండింగ్ కేసుల వివరాలు కమిషనర్ అడిగి తెలుసుకుని తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. నేరాలకు పాల్పడే వారికి శిక్షపడేలా నైపుణ్యంగా దర్యాప్తు చేయాలని సూచించారు. గంజాయి, అత్యాచారాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నాన్‌బెయిలబుల్ వారెంట్లు ఉన్నవారిని వెంటనే అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచాలన్నారు. సమావేశంలో డీసీపీలు రవీందర్, అబ్దుల్ బారీ, ట్రైయినీ ఐపీఎస్ అధికారులు అంకిత్, శుభంనాగ్, అదనపు డీసీపీ రవి తదితరులు పాల్గొన్నారు.

'నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 1: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఒకే పర్మిషన్‌తో రెండు పాఠశాలలు నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు సోమవారం డీఆర్ఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున మాట్లాడుతూ అక్రమంగా పాఠశాల నడిపించడమే కాకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల సాయికుమార్, మాగాని సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఆధ్యాత్మిక శోభ

కరీమాబాద్, ఏప్రిల్ 1: శంభునిపేట ప్రాంతంలోని గణేష్‌నగర్ కాలనీలో సోమవారం అభయాంజనేయ స్వామివిగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నెల్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ అభయాంజనేయా స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మహా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్, కొండేటి శ్రీధర్, 44వ డివిజన్ కార్పొరేటర్ జలగం రంజిత్ 43వ డివిజన్ కార్పొరేటర్ విక్టరీ అరుణ, 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందనా పూర్ణచందర్, రంగశాయిపేట కాలనీస్ అధ్యక్షుడు కర్నె రవీందర్, గణేష్‌నగర్ అధ్యక్షుడు విజయ్, కాలనీ పెద్దలు శ్రీనివాస్‌రావు, సోమయ్య, కిషన్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ ప్రత్యేక పూజలు చేశారు.



వేడుకల్లో బీజేపీ నాయకులు



కాశీవిశ్వేశ్వరాలయంలో...

వరంగల్ సిటీ, ఏప్రిల్ 1: కాశిబుగ్గ శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో సోమవారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మూల నక్షత్రం సందర్భాన్ని పురస్కరించుకుని చండీహవనం తొమ్మిది జంటలతో నిర్వహించారు. పూజాది కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బయ్యస్వామి, బోడకుంట్ల వైకుంఠం, బొమ్మగాని కిష్టమూర్తి, కుంటపల్లి ఉమాశంకర్, జంగం రాజు, పాశికంటి రమేష్, కుసుమ దయాసాగర్, బండారి భాస్కర్, బరుపటి సతీష్ పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయంలో టూరిజం ఏడీ

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 1: చారిత్రక శ్రీభద్రకాళి అమ్మవారిని రాష్ట్ర టూరిజం శాఖ ఏడీ మహేష్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనతో పూజాలు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ప్రసాదాలను అందజేశారు. టూరిజం శాఖ ఏడీ వెంట జిల్లా టూరిజం శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న ఏడీ

బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం

కరీమాబాద్, ఏప్రిల్ 1: కరీమాబాద్‌లోని నానామియతోటలో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలు సోమవారం నిర్వహించారు. పూజారి పోలోజు భాస్కరాచారి ఆధ్వర్యంలో ధాన్య దివాసం, అభిషేకాలు, విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేడుకల్లో భాగంగా రాత్రి నానామియతోటలో పరిధిలో బలిచల్లుడం, పోలిపోయు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సమయంలో అష్టదిగ్బంధనం చేశారు. బొడ్రాయి ప్రతిష్ఠాపన చేస్తున్న సందర్భంలో భక్తులు చేసిన కేరింతల తో నానామియాతోట ప్రాంతం దద్దరి ల్లింది. బొడ్రాయి కమిటీ ఆధ్వర్యంలో ఈ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్విఘ్నంగా పూర్తి చేయడం ఆనందంగా ఉందని బొడ్రాయి ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.



బొడ్రాయి క్రతువులు నిర్వహిస్తున్న అర్చకులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ

నేటినుంచి బ్రహ్మోత్సవాలు

మట్టెవాడ, ఏప్రిల్ 1: మట్టెవాడలోని శ్రీవేణుగోపాల స్వామి దేవాలయంలో 2 నుంచి 7 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షుడు ఇరుకుళ్ల రమేష్, మాజీ కార్పొరేటర్ తోట నవీన్‌కుమార్‌లు తెలిపారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.2న అభిషేకం, శేష వాహన సేవ, 3న సంతాన వేణుగోపాల సహిత, వైనతేయ ఇష్ఠి, 4న శ్రీసుదర్శన నారసింహ ఇష్ఠి, 5న శ్రీమహాలక్ష్మి సహిత ధన్వంతరి ఇష్ఠి, మహా అన్నదానం, తిరుకల్యాణం ఉంటుందన్నారు. 6న శ్రీభూవరాహ ఇష్ఠి రథోత్సవం, 7న శ్రీలక్ష్మీ హయగ్రీవ ఇష్ఠి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తోట నవీన్, కమిటీ సభ్యులు కొత్త వెంకటకృష్ణ, పబ్బ విశ్వప్రసాద్, రజినీకాంత్, నాగేశ్వర్‌రావు,నాగరాజు, శ్రీనివాస్, నీల రాజన్న, పబ్బ కిశోర్, గుండా రాజేష్, రమేష్ పాల్గొన్నారు.

'కోడ్‌పై అవగాహన కలిగి ఉండాలి'

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 1: ఎన్నికల నియమావళిపై అధికారులకు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని లోక్‌సభ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. వరంగల్ ఎల్బీ కళాశాలలో ఎన్నికల సందర్భంగా వరంగల్ తూర్పు -106 లో పనిచేసే పీవో, ఏపీవోలకు సోమవారం నుంచి శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. ఈ శిబిరాన్ని కమిషనర్ అధికారులతో కలిసి సందర్శించారు. అక్కడ శిక్షణ పొందుతున్న అధికారులకు పలు సూచనలు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణ పొందుతున్న వారు అనుమానాలుంటే మాస్టర్ ట్రైనర్లను అడిగి అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఎన్నికల ప్రొసీజర్‌పై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్లపై అధికారులకు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ అజీత్‌రెడ్డి, జేడీ బాలకృష్ణ, తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావులతో పాటు మాస్టర్ ట్రైనర్లు సందీప్‌కుమార్, కృష్ణ, కనకయ్య, వాసు, నాగరాజు, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

కాషాయ జెండా ఎగురవేస్తాం : బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

కరీమాబాద్, ఏప్రిల్ 1: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. సోమవారం ఎర్రబెల్లి ప్రదీప్‌రావు క్యాంపు కార్యాలయంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం బూత్ అధ్యక్షులు, బూత్ కార్యకర్తలతో సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్, జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, మురళీధర్‌గౌడ్, మాజీ శాసనసభ్యులు ధర్మారావు, వన్నాల శ్రీరాములు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌లు పాల్గొన్నారు. ప్రదీప్‌రావు మాట్లాడుతూ రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని, పదికిపైగా సీట్లు గెలుచుకొని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చి బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు. వరంగల్ రైల్వే స్టేషన్, కాజీపేట, ముఖ్యనగరాలకు ఫోర్‌వే లైన్ రోడ్లు, వేయిస్తంభాల గుడి పునర్నిర్మాణం, 2014 నాటికి తెలంగాణలో 2511 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులను అందుబాటులోకి ప్రధాని మోదీ తీసుకొచ్చారన్నారు. 2,269 కిలోమీటర్ల జాతీయ రహదారులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. కరీంనగర్ నుంచి వరంగల్, వరంగల్ నుంచి యాదాద్రికి ఫోర్‌లైన్ జాతీయ రహదారి విస్తరణ, స్మార్ట్‌సిటీస్ మిషన్ ద్వారా వరంగల్ పట్టణంలో మౌళికసదుపాయాల కోసం రూ.250 కోట్లు మోదీ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, వంగాల సమ్మిరెడ్డి, వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ కుమార్, కో కన్వీనర్ అల్లం నాగరాజు, వరంగల్ తూర్పు అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా, జిల్లా ప్రధాన కార్యదర్శి హరిశంకర్ పాల్గొన్నారు.

కావ్యకే టికెట్

(5వ పేజీ తరువాయి)

తెరపడడంతో ఇక తరువాత పరిణామాలు ఎలా ఉంటాయనే అంశం చర్చంశనీయాంగా మారింది.

అనూహ్యంగా టికెట్ సొంతం

కొన్ని రోజుల కిందట బీఆర్ఎస్ అభ్యర్థిగా డాక్టర్ కావ్యను ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. దీంతో కావ్య పోటీకి రంగం సిద్ధమైంది. ఇక ప్రచారమే తరువాయి అనుకుంటున్న సమయంలోనే కడియం కావ్య బీఆర్ఎస్‌కు కోలుకోలేని షాక్ ఇచ్చారు. కవిత అరెస్టు, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలను ఉటంకిస్తూ బీఆర్ఎస్ నుంచి పోటీ చేయలేనంటూ స్పష్టం చేయడంతో బీఆర్ఎస్‌కు పెను దెబ్బ తగిలింది. ఆ వెంటనే కడియం శ్రీహరి కూడా బీఆర్ఎస్‌కు బైబై చెప్పడం.. తండ్రి, కూతురు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు సంకేతాలు ఇవ్వడంతో ఊహించని రాజకీయ పరిణామాలు తెరపైకి వచ్చాయి.

ఎమ్మెల్యేలను కలుస్తున్న తరుణంలోనే..

కడియం శ్రీహరి, కావ్య హైదరాబాద్‌లో కాంగ్రెస్‌లో చేరిన తరువాత సోమవారం వరంగల్‌లోనే ఉదయం నుంచి పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలను కలుస్తూవచ్చారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును వారివారి క్యాంపుకార్యాలయాల్లో కలిశారు. నాగరాజు కార్యాలయంలో మీడియాతో కూడా శ్రీహరి, కావ్య మాట్లాడారు. టికెట్ విషయాన్ని మీడియా ప్రస్తావించినా ఏ మాత్రం కూడా బయట పడకుండా మాట్లాడారు. ఆ తరువాత సాయంత్రం మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీని వారి నివాసంలో కలిశారు. ఇలా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను కలుస్తున్న తరుణంలోనే కావ్యకు టికెట్ ఖరారైందనే వార్తలు వెలుబడ్డాయి.

పోటీపడ్డ నేతలకు చుక్కెదురు

వరంగల్ లోక్‌సభ టికెట్‌పై పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులతో పాటు ఇతరులు కూడా సీరియస్‌గా ప్రయత్నించారు. ఎందరి పేర్లో తెరపైకి వచ్చాయి. ఒక విధంగా స్థానికేతరుడైన అద్దంకి దయాకర్ పేరు కూడా తొలి నుంచి వినిపించింది. ఇక జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు దొమ్మాటి సాంబయ్య, నమిండ్ల శ్రీనివాస్, డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్, బొడ్డు సునిత, జన్ను పరంజ్యోతి, డాక్టర్ అనిల్, డాక్టరు పెరుమాండ్ల రామక్రిష్ణ.. ఇలా ఎందరో నాయకులు టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేయగా నిరాశే ఎదురైంది. కడియం కావ్యకు టికెట్ కేటాయింపుపై ఆశావహులతో పాటు కాంగ్రెస్ శ్రేణుల్లో కూడా అసంతృప్తి నెలకొంది.

'ఎగుమతులు లేక తగ్గిన మిర్చి ధర'

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 1: అంతర్జాతీయ మార్కెట్లో ధరలు ఆశాజనకంగా లేవని, వియత్నాం, చైనా, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్, మలేసియా లాంటి దేశాలకు తగినతంగా ఎగుమతులు లేవని దీంతో వ్యవసాయ మార్కెట్లలో ధరలు మందగించినట్లు వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. గత రెండు మూడేళ్లుగా వరంగల్ (ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్‌కు అధికమొత్తంలో మిర్చి వచ్చినా, అడ్తిదారులు ఖరీదుదారులకు సరుకును చూపించి రైతుకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేసిందని తెలిపింది. గత సంవత్సరం కంటే ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచే కాకుండా ఆదిలాబాద్, మంచిర్యాల్, కాగజ్‌నగర్, చెన్నూరు, ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలు అదే కాకుండా మహారాష్ట్ర, చత్తీస్‌గడ్, ఆంధ్రా, కర్ణాటక రాష్ట్రాల నుంచి సైతం సరుకు వచ్చేదని పేర్కొన్నారు. దీంతో కోల్డ్ స్టోరేజీలన్నీ నిండి పోయాయని, ఈ నేపథ్యంలో ఏప్రిల్ నుంచి రైతులు మార్కెట్‌కు మిర్చి పంటను అమ్మకానికి తీసుకువచ్చే ముందు రోజు మార్కెట్లో మారుతున్న ధరలు, కోల్డ్ స్టోరేజీలలో నిల్వ అవకాశాలు, ప్రత్యామ్నాయ నిల్వలపై దృష్టిసారించాలని కోరింది.

ఎన్నికల్లో జాగ్రత్తలు పాటించాలి

జిల్లా రెవెన్యూ శాఖ అధికారి శ్రీనివాస్



పీవోలు, ఏపీవోలకు సూచినలు చేస్తున్న శ్రీనివాస్

సంగెం, ఏప్రిల్ 1: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో అధికారులు తగు జాగ్రత్తలు పాటించాలని వరంగల్ జిల్లా రెవెన్యూ శాఖ అధికారి కె.శ్రీనివాస్ సూచించారు. బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ విద్యా సంస్థల్లో సోమవారం ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల పోలింగ్ నిర్వహణ అధికారులు అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు శిక్షణ నిచ్చారు. శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఓటర్ల గుర్తింపు కార్డును పరిశీలించిన తర్వాతనే హాలులో ఓటు వేయడానికి అనుమతించాలన్నారు. పోలింగ్ బూతులను ఎప్పటికప్పుడు నిత్యం పరిశీలించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు 500 మంది పీవోలు, ఏపీవోలను ఎంపిక చేసి 260 మందికి వాగ్దేవిలో సోమవారం ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇవ్వడం జరిగిందని శిక్షణ ఇన్‌చార్జి పర్వతగిరి తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. మంగళవారం మిగతా పీవోలు, ఏపీవోలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వరంగల్ ఆర్డీవో సిడాం దత్తు, డివిజన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి దిలావర్ మహ్మద్‌అబిద్‌అలీ, ఎన్నికల శిక్షణ ఇన్‌చార్జి, పర్వ తగిరి తహసీల్దార్ వెంకటస్వామి, వర్ధన్నపేట తహసీల్దార్ విజయ్ సాగర్ పాల్గొన్నారు.

దొంగతోనే కండువా కప్పుకొంటివి..

(5వ పేజీ తరువాయి)

విమర్శించారు. స్టేషన్‌ఘనపూర్ ప్రజలకు తాను అండగా ఉంటానన్నారు. దాస్యం వినయభాస్కర్ మాట్లాడుతూ కడియం జీవితమంతా నీచ చరిత్రేనని, దళితుడని అని చెప్పుకొనే ఆయన.. ఏరోజు దళితులను చేరదీయలేదన్నారు. కడియం ఇబ్బందులు భరించలేకనే రాజయ్య, ఆరూరి రమేశ్, పసునూరి దయాకర్ బీఆర్ఎస్‌ను వీడారన్నారు. ఇన్ని పార్టీలు మారిన కడియం.. కేఏపాల్ ప్రజాశాంతి పార్టీకి కూడా పోతాడని ఎద్దేవా చేశారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెం కటరమణారెడ్డి, జడ్పీ చైర్మన్‌లు సుధీర్‌కుమార్, గండ్రజ్యోతి, మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, సుందర్‌రాజ్, నేతలు నాగుర్ల వెంకటేశ్వర్లు, భీరవెల్లి భరత్ కుమార్‌రెడ్డి, కె.వాసుదేవరెడ్డి, లలితాయాదవ్, హరిరమాదేవి, ఇండ్ల నాగేశ్వర్‌రావు, జనార్దన్‌గౌడ్, జోరిక రమేశ్, వీరేందర్, రజనీకుమార్, చింతల యాదగిరి పాల్గొ న్నారు. కాగా, హరీష్‌రావు మాట్లాడే క్రమంలో చిట్యాలకు చెందిన కం జర్ల రమణకుమార్ అనే కార్యకర్త ఒక్కసారిగా వేదికపైకి వచ్చి కాళ్లకు మొక్కి సెల్ఫీ తీసుకున్నాడు. ఎన్నికల సమయంలో రేవంతర్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాలను స్క్రీన్‌పై చూపిస్తూ ప్రసంగించినప్పుడు కార్యకర్తలనుంచి మంచి స్పందన వచ్చింది.

కాలువలో మృతదేహం లభ్యం

మట్టెవాడ, ఏప్రిల్ 1: వరంగల్ ఎస్సారెస్పీ కెనాల్ పెద్దమ్మగడ్డ వద్ద శనివారం ఓ యువకుడు కెనాల్‌లో దూకగా, సోమవారం అతడి మృతదేహం పైడిపెల్లి కెనాల్ వద్ద లభించినట్లు మట్టెవాడ ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం. హనుమకొండ పెద్దమ్మగడ్డ ప్రాంతానికి చెందిన పులుమారి సుధీర్ ప్రైవేటు కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడుసుధీర్ (38) మార్చి 30న సాయంత్రం ములుగురోడ్ పెద్దమ్మగడ్డ ఎస్సారెస్పీ కెనాల్‌లో సుధీర్ దూకాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు, కుటుంబ సభ్యులు కెనాల్ వెంబడి వెతుకుతుండగా సోమవారం పైడిపల్లి వద్ద కెనాల్‌లో మృతదేహం లభించింది. మృతుడికి భార్య ఉంది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించారు.

ఇద్దరు ఆకతాయిలపై కేసు



అరెస్టు చూపుతున్న సీఐ గోపి

మట్టెవాడ, ఏప్రిల్ 1: రోడ్డుపైన ద్విచక్ర వాహనంపైవిన్యాసాలు చేస్తూ మార్చి 26న వేగంతో వెళ్తున్న వీడియోసోషల్ మీడియాలో వెలుగులోకి రావడంతో మట్టెవాడ పోలీసులు ఇద్దరు యువకులపై కేసు నమోదు చేశారు. మార్చి 26న ఎల్బీ కళాశాల ముందు నుంచి బైక్‌పై విన్యాసం చేస్తూ అతివేగంగా నడిపిన హనుమకొండ నయీంనగర్‌కు చెందిన మంద సాయివిఘ్నేష్, హంటర్ రోడ్డుకు చెందిన నాగచైతన్యను సోమవారం పోలీసు లు కేసు నమోదు చేసి, వారిని అరెస్టు చేసి, బైక్‌ను స్వాధీన పర్చుకున్నట్లు సీఐ గోపి తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్ల అందజేత

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 1: సెల్ ఫోన్లు పోగొట్టుకున్న వారికి అవి గుర్తించి సోమవారం ఇంతేజార్‌గంజ్ పోలీసులు అందించారు. సెల్‌ఫోన్లు పోదగొట్టుకుంటే గుర్తిపట్టే పరికరం అందుబాటులోకి రావడంతో, సీఈఐఆర్ పోర్టల్‌ను ఉపయోగించి పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను గుర్తించారు. సెల్‌ఫోన్ పోయిన వారు మీ సేవాలో దరఖాస్తు చేసుకోవాలని, సీఈఐఆర్ పోర్టల్‌లో కూడా బాధితులు నమోదు చేసుకోవాలని సీఐ మచ్చ శివకుమార్ కోరారు. సెల్‌ఫోన్లు పోయిన బాధితులు ఎండి ఎషా, ఎస్.మణికంఠ, టి.రాజు, వి.సాయికుమార్, ఎ.అనిల్, వి.శివలకు వారి ఫోన్లను సీఐ అందజేశారు.

కొండాను కలిసిన గౌడ సంఘం



కరీమాబాద్, ఏప్రిల్ 1: కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావును సోమవారం గౌడ సంఘం నాయకులు, మాజీ కార్పొరేటర్ బత్తిని వసుందర ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గీత పారిశ్రామిక సహకార సంఘం గ్రూప్ -1 చైర్మన్ మండ వెంకన్న గౌడ సంఘం అబివృద్ధికి, గౌడల అభ్యున్నతికి సహకరించాలని కోరారు. కొండా మాట్లాడుతూ గౌడ సంఘం అభివృద్ధికి తనవంతు సహాయసహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బత్తినిహరి, నాగపూరి సంజయ్‌బాబు, బత్తిని రాజు, బత్తిని అఖిల్, నాగపూరి కల్పన, నాగపూరి వెంకటేశ్వర్లు, నాగపూరి భిక్షపతి, కన్నెరవి, నాగపూరి కుమార్, గొడిశాల వెంకన్న, నాగపూరి రాజు పాల్గొన్నారు.

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్త పడాలి : కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 1: వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా ఆరోగ్య జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న రెండు నెలలపాటు అధికఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉన్నదని, దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు వడదెబ్బ బారినపడకుండా వారికి అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయట తిరగరాదని, తప్పని పరిస్థితుల్లో గొడుగు, టోపీ, తెల్లురుమాలు ధరించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 14ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో, ఏడు పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో, రెండు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో, 118 ఆరోగ్య ఉప కేంద్రాల్లో రెస్పాండ్ టీములను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గోపాల్‌రావు, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, రెస్పాండ్ టీం క్రాంతికుమార్ పాల్గొన్నారు.



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL మంగళవారం 2 ఏప్రిల్ 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

పార్లమెంటు ఎన్నికల మండల కన్వీనర్‌గా అనిల్



నూనె అనిల్

రాయపర్తి, ఏప్రిల్ 1 : రాయపర్తి మండల పార్లమెంటు ఎన్నికల కన్వీనర్‌గా మండల కేంద్రానికి చెందిన నూనెల అనిల్‌ను నియమించినట్లు జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎన్నికల బాధ్యతను అప్పగించి నందుకు పార్టీని బలోపేతం చేయడంతో పాటు ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చేవిధంగా చూస్తానని తెలిపారు. బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ భారీ మెజార్టీతో గెలువబోతున్నారని స్పష్టం చేశారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామ్మోహన్‌రెడ్డి, జనగాం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ర శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ పూసల శ్రీమాన్, కో-కన్వీనర్ కోటేశ్వర్, గడ్డం నరేందర్, భీష్మరెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల్లో పోలింగ్ అధికారుల పాత్రే కీలకం



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి

నర్సంపేట, ఏప్రిల్ 1 : ఎన్నికల నిర్వాహణలో పోలింగ్ అధికారుల పాత్ర కీలకమని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. నర్సంపేట శివారులోని బిట్ కళాశాలలో మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గ ప్రిసైడింగ్ (పీవోలు) అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని ఆర్డీవో కృష్ణవేణితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ లోకసభ ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బంది ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఎన్నికల శిక్షణలో భాగంగా తొలి విడత శిక్షణ ఇచ్చామన్నారు. బ్యాలెట్, కంట్రోలింగ్ యూనిట్, వివి ప్యాట్‌ల అమరిక తదితర అంశాలపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని సూచించారు. బాధ్యతగా, సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. 2వ, 3వ ధపా శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. పీఓలకు సెక్టార్ అఫీసర్లు సహకారం అందిస్తారని, ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతీ ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును ఖచ్చితంగా వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల తనిఖీ



ఓ ప్రైవేటు ఆస్పత్రి నిర్వాహకులకు నోటీసును అందిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్

నర్సంపేట, ఏప్రిల్ 1: జిల్లా వైద్యాధికారి వెంకటరమణ ఆదేశాల మేరకు నర్సంపేట పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులను సోమవారం సిబ్బందితో కలిసి డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్ తనిఖీ చేశారు. ఫైర్‌సేఫ్టి సౌకర్యాలు, పొల్యూషన్, సిబ్బంది, డాక్టర్లు, సర్టిఫికెట్ల వివరాల రికార్డులను పరిశీలించారు. సైన్ బోర్డులపై ఒకరి పేరు, సర్టిఫికెట్లు మరొకరి పేరు, విధులు నిర్వహించే వారు ఇంకొకరు ఉండడాన్ని గమనించి డాక్యుమెంటేషన్ సక్రమంగా లేకుంటే ఆస్పత్రులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఫైరర్‌సేఫ్టిలేని, సర్టిఫికెట్లు ఒకరివి ఉండి విధులు నిర్వహించేవారు వేరొకరు ఉండడాన్ని గుర్తించి కేర్ హాస్పటల్, శ్రీరక్ష, గంగ హాస్పటల్, త్రినాథ్, జనని నర్సింగ్ హోమ్, శశి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులకు నోటీసులు ఇచ్చామని డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు ఆచార్య, అరుణ్‌చంద్ర, హెచ్‌వో మార్త, సీహెచ్‌వో నీల పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై

పర్వతగిరి, ఏప్రిల్ 1 : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న రౌడీ షీటర్లకు సోమవారం ఎస్సై గుగులోత్ వెంకన్న కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున గ్రామాల్లో ఏవైనా గొడవలు సృష్టిస్తే సహించబో మన్నారు. రాజకీయ పార్టీల విషయాల్లో తల దూర్చకూడదని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టేలా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కళతప్పిన జలాశయాలు

గోదావరి జలాలు మళ్లించాలని కోరుతున్న రైతులు

మట్టితవ్వకాలతో బొందలగడ్డలుగా మారిన చెరువులు



మాధన్నపేట చెరువులోని పెద్దగుంతలో నిలిచిన నీటిని చౌర్యం చేసేందుకు వేసిన పైపులు



మైదానంలా మారిన నర్సంపేట సమీపంలోని దామెర చెరువు

నర్సంపేట, ఏప్రిల్ 1 : నీరు అడుగంటి కొన్ని జలాశయా(చెరువు)లు కళ తప్పాయి. చిన్న చిన్న చెరువులు, కుంటలు చుక్కనీరు లేక వెలవెల పోయాయి. సూర్య ప్రతాపానికి తోడు ఖరీఫ్ అనంతరం చెరువులు, కుంటల్లోని నీటి మట్టాలు ఘన నీయంగా తగ్గిపోతున్నాయి. నర్సంపేట మండలంలోని కొన్ని చెరువులు కుంటలలో నీరు లేక మైదానాలను తలపిస్తున్నాయి.అక్రమ సాగువల్ల కూడా చెరువుల్లో నీటి మట్టం అడుగంటి ఆయకట్టు రైతుల పొలాలు ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి, జిల్లాలోనే ధాన్యాగారంగా, రైతుల పాలిట కల్పతురుగా గుర్తింపు పొందిన పాఖాల సరస్సుతోపాటు, మాధన్నపేట, రంగాయచెరువు, కోపాకుల చెరుల్లో నీటి మట్టం తగ్గిపోయింది.

బొందల గడ్డలుగా ..

గత రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన మిషన్ కాకతీయ పథకం కింద చెరువు పునరుద్ధరణ పనుల సందర్భంలో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరపడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అలాగే కొంతమంది మట్టి దందా కొనసాగించే వ్యక్తులు చెరువుల్లో ఇష్టారాజ్యంగా మట్టికోసం తవ్వకాలు చేపట్టడంతో కొన్ని చెరువులు బొందలగడ్డలు మారాయి. మాధన్నపేట, మాధన్నపేట చిన్న చెరువు, దామెర చెరువులు నీటి మట్టం తగ్గి కళతప్పి కనిపిస్తున్నాయి. మట్టి దందా వ్యాపారులు దురాశతో చెరువుల్లో తవ్విన కందకాల వల్ల చెరువుల ఆవరణ అంతా బొందలగడ్డలుగా కనిపిస్తున్నారు. చెరువుల్లో అ క్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని రైతులు బాహాటంగా విమర్శిస్తున్నారు. చెరువుల్లో గుంతల కారణంగా నీటి నిల్వతగ్గి రైతులు రెండు పంటలు పండించికునే అవకాశాన్ని కోల్పోతున్నారు. గత ఖరీఫ్ అనంతరం చెరువుల్లో ఉన్న నీటి నిల్వలను ఆధారం చేసుకుని ఐబీ శాఖ అధికారులు ప్రస్తుత రబీలో రొటేషన్ పద్ధతిలో టైబందీని ఖరారు చేసి కాల్వల ద్వారా సాగు నీటిని అందిస్తున్నారు.

మాధన్నపేట చెరువులో తగ్గిన నీటి మట్టం...

నర్సంపేట మండలంలో వందలాది ఎకరాల పంటలకు సాగునీరు అందించే మాధన్నపేట చెరువులో నీటి మట్టం భారీగా తగ్గిపోయింది. 16.5అడుగుల నీటి మట్టం కలిగిన మాధన్నపేట చెరువులో కేవలం 5 అడుగుల నీరే ఉంది. ఈ చెరువు కింద ప్రస్తుత రబీలో 450ఎకరాల టైబందీని పెద్ద కాల్వ కింద ఖరారు చేశారు. ఈ చెరువు నీటిని అక్రమంగా పైపులు ఏర్పాటు చేసుకొని నీటిని మళ్లించుకుని సాగు చేసుకోవడంతో ఆయకట్టు రైతులకు నీరందని పరిస్థితులు నెలకొన్నాయి. మాధన్నపపేట చెరువులోకి గోదావరి జలాలు మళ్ళించే చర్యలు తీసుకొని పంటలకు నష్టం జరుగుకుండా ఆయకట్టు రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని రైతులు కోరుతున్నారు.

బోసిపోయిన దామెర చెరువు, మాధన్నపేట చిన్నచెరువు

మాధన్నపేట గ్రామ సమీపంలో ఉన్న చిన్న చెరువు, నర్సంపేట పట్టణ శివారులోని దామెర చెరువుల్లో నీరుపూర్తిగా అడుగంటి కళతప్పి మైదానంలా కనిపిస్తున్నాయి. ఖరీఫ్ అనంతరం ఈ చెరువుల్లో నీటిమట్టం అడుగంటిపోయాయి. తూముకు దూరంగా మట్టికోసం తవ్విన గుంతల్లో నీరు చిలిచి ఉండ డంతో ఆ నీరు పంటలకు ఉపయోగపడే పరిస్థితిలేదు. ఈ చెరువు ల్లోకి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని మళ్లించే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పాకాల, రంగాయ చెరువుల్లో తగ్గిన నీటి మట్టం...

ఖరీఫ్ సీజన్ అనంతరం ఉన్న నీటి నిల్వను ఆసరా చేసుకుని ప్రస్తుత రబీలో టైబందీని ఖరారు చేసి సాగునీటిని సరఫరా చేస్తున్నారు. 30అడుగుల నీటి మట్టానికి గాను ప్రస్తుతం సరస్సులో 23 అడుగుల నీటి మట్టం ఉంది. ఈ చెరువు కింద రబీలో ఎకరాల టైబందీని నిర్ణయించి సాగునీటిని అధికారులు విడుదల చేస్తున్నారు. ఈ నీటిలో నుంచి కొంత నర్సంపేట పట్టణ ప్రజలకు తాగునీటిని అందించాల్సి ఉంటుంది. నల్లబెల్లి మండలంలోని రంగాయ చెరువులో 17 అడుగులకు గాను 15 అడుగుల నీటి మట్టం ఉంది. ఈ చెరువు కింద సాగైన వరికి నీటి కొరత లేదు. పాఖాల, రంగాయ చెరుల్లోకి గోదావరి జలాలు మళ్లించడం వల్ల చెరువుల్లో ఆశించతగ్గ నీటి మట్టం నిలువ ఉంది. దుగ్గొండి, చెన్నారావుపేట, నెక్కొండ మండలాల్లోని చెరువులకు ఎస్సారెస్పీ నీటిని మళ్లించడం వల్ల ఆయా మండలాల్లోని చెరువుల్లో నీటి నిల్వలు ఉన్నాయి.

మోదీని మరోసారి ఆశీర్వదించాలి



లబ్ధిదారులను కలిసి మాట్లాడుతున్న గంట రవికుమార్

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 1 : దేశాభివృద్ధికి, సంక్షేమానికి కృషిచేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీని మరోసారి ఆశీర్వదించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. పట్టణంలోని పలు బూతుల్లో నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులను సోమవారం కలిశారు.ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ ఇంటింటికి స్టిక్కర్లను అంటించారు. సరల్ యాప్‌లో అప్లోడ్ చేయించి మరోసారి మోదీని ఆశీర్వదించాలని లబ్ధిదారులను కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ చేరికల కమిటీ చైర్మెన్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, కౌన్సిలర్ జుర్రు రాజు, పార్టీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శీలం రాంబాబు, గూడూరు సందీప్, బీజేపీ నాయకులు మల్యాల వినయ్, ఠాకూర్ చిన్న రవీందర్‌సింగ్, పంజాల రాము తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్స్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

చెన్నారావుపేట, ఏప్రిల్ 1 : మండల కేంద్రంలోని సుభాష్ చంద్రబోస్ డ్రైవర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్క ఇంద్రయ్య, ఉపాధ్యక్షుడిగా బొమ్మకంటి రాజు, కార్యదర్శిగా వల్లా సదానందం, కోశాధికారిగా బండారి సతీష్, సహాయ కార్యదర్శిగా చామంతుల రాజు, ముఖ్య సలహాదారుడిగా మాదాసి కుమారస్వామి లను ఎన్నుకున్నారు.

నవోదయలో సీట్లు సాధించిన విద్యార్థులు



మధు



నిత్యశ్రీ

నెక్కొండ , ఏప్రిల్ 1: మండల కేంద్రంలోని విద్యోదయ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి రాపాక మధు, స్నేహ ప్రగతి పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని పరకాల నిత్యశ్రీ నవోదయలో సీట్లు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్‌లు చల్లా నాగార్జునరెడ్డి, కె.అశోక్ కుమార్‌లు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను ఉపాధ్యాయులతో పాటు పలువురు అభినందిచారు.

ఉపాధి పనుల పరిశీలన

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 1 :మండలంలోని ఇల్లంద గ్రామ ఊర చెరువులో చేస్తున్న ఉపాధి హమీ పనులను సోమవారం డీఆర్డీవో కౌసల్య దేవి పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఎండాకాలం ఇప్పటికే ప్రారంభమైన సందర్భంగా తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలను తెలిపారు. పనివేళల్లో ఉదయాన్నే పనికి వచ్చి అధికారులకు సహకరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఉపాధి హమీ కూలీల రేట్లు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం సంతోషకరమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఏపీవో నాగేశ్వర్‌రావు, గ్రామ కార్యదర్శ రామారావు పాల్గొన్నారు.

నీటి వనరుల వివరాల సేకరణ

దుగ్గొండి, ఏప్రిల్ 1 : వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా చేయడానికి గ్రామాల్లోని నీటి వనరులను సోమవారం మిషన్ భగీరథ క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్రీనివాస్ చాపలబండ, మందపల్లి, గిర్నిబావి గ్రామాల్లో సందర్శించి వివరాలను సేకరించారు. తాగునీటి వనరుల వివరాలను స్థానిక కార్యద ర్శులను నుంచి తెలుసుకున్నారు. వేసవి కాలంలో నీటి ఎద్ద డిలేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారితోపాటు మిషన్ భగీరథ ఏఈ మౌనిక, కార్యదర్శులు ఉన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 1: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని వర్ధన్నపేట ఎంపీడీవో వెంకటరమణ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో స్వీప్-2024 పై వృద్ధులకు, దివ్యాంగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఆ దిశగా అధికారులు సైతం కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్డీవో, జేడీఏ

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 1 : గ్రామీణ ప్రాంత రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా డీఆర్డీవో పీడీ కౌసల్య దేవి, జిల్లా వ్యవసాయ అధికారిణి ఉషాదయాల్‌లు సూచించారు. సోమవారం మండలంలోని ఇల్లందలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఐకేపీ సహకారంతో బృందావన మండల మహిళా సమైఖ్య ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఇసుక, మట్టి, తాలు లేకుండా నాణ్యతగల ధాన్యాన్ని తీసుకు వచ్చి నిర్వాహకులకు సహకరించాలనిసూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 9 మండలాల్లో వరి ధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవి కాలం కావడంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు కనీస సదుపాయాలు కల్పించాలని సూచించారు. మ్యాచింగ్ ఉన్న ధాన్యాన్ని వెంటనే కాంటాలు పెట్టి మిల్లులకు తరలించాలని తెలిపారు. గన్నీ సంచుల కొరత లేకుండా చూసుకోవడంతోపాటు తార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో రేణుకాదేవి, డీపీఎం భవాణి, ఎంపీడీవో వెంకట రమణ, ఏపీఎం వేణు, మండల మహిళా అధ్యక్షురాలు అరుణ, కార్యదర్శి తూళ్ల శ్రావణి, సీసీలు గోలి కొమురయ్య, రమేష్, కమిటీ సభ్యులు భాగ్యలక్ష్మి, రేవతి, గ్రామైఖ్య సంఘాల అధ్యక్ష కార్యదర్శులు మౌనిక, నజీమా తదితరులు పాల్గొన్నారు.

• పర్వతగిరి : మండలంలోని మల్యాతండాలో వాసుదేవ గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం కృష్ణమూర్తి సోమవారం ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళా రులను ఆశ్రయించి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ.2,203, కామన్‌గ్రేడ్ ధాన్యానికి రూ.2,183 ధర అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రాకేష్, సీసీలు సుధాకర్, రవీందర్ రాజు, వీవో అధ్యక్షురాలు సుమలత, వీవోఏలు, సభ్యులు యాకస్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

• రాయపర్తి :మండలంలోని పెర్కవేడులో లక్ష్మీ ప్రసన్న గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీవో కిషన్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎం కిరణ్ కుమార్, సీసీ దేవేంద్ర, సీఏలు రమాదేవి, మంగమ్మ, దివ్య నిర్వాహకులు సుజాత, రాణి రైతులు పాల్గొన్నారు.

• చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేటలో మహిళ సంఘం వారి ఆధ్వర్యంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం ఈశ్వరయ్య ప్రారంభించి మాట్లాడారు.ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల సమైఖ్య అధ్యక్షురాలు కత్తి అనిత, కొక్కు యమున, కట్టయ్య, యాదమ్మ, సీసీ కట్టయ్య అనిత, మాధవి, రజిత, యాకయ్య పాల్గొన్నారు.

• నెక్కొండ: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం శ్రీనువాస్ అన్నారు. మండలంలోని దీక్షకుంట్ల గ్రామంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాను ప్రసాద్, సీసీ శారద, భూలక్ష్మీ, ఏకాంబ్రం, మధుకర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


గుప్తనిధుల కోసం తవ్వకాలు



గంగమ్మ గుడి సమీపంలో తవ్వకాలు

నెక్కొండ, ఏప్రిల్ 1 : నెక్కొండ మండలం వెంకట్ తండా గ్రామంలో ఆదివారం రాత్రి గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తుల తవ్వకాలు జరిపినట్లు గ్రామస్థులు తెలిపారు. గుడి సమీపంలో పసుపు, కుంకుమ, ఆగరువత్తులతో పూజలను జరిపి, రాతిపై వెలసిన గంగమ్మదేవత శిలావిగ్రహం మేడలో నిమ్మకాయల దండలు వేశారు. ఈ తవ్వకాలను జేసీబీతో జరిపారని ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తులపనై ఉంటుందని ప్రజలు అభిప్రాయాలను వ్యక్తంచేశారు. ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

తక్కళ్ళపల్లి రవీందర్‌రావుకు సన్మానం



రవీందర్‌రావును సన్మానిస్తున్న పట్టణ కాంగ్రెస్ నాయకులు

నర్సంపేట, ఏప్రిల్ 1 : జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధిగా నియామకమైన తక్కళ్ళపల్లి రవీందర్‌రావును పట్టణంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్యగౌడ్ మాట్లాడుతూ గత 25ఏళ్ల క్రితం దొంతి మాధవరెడ్డి ఆహ్వానం మేరకు కాంగ్రెస్ పార్టీలో చేరి రెండు పర్యాయాలు ఖానాపురం సొసైటీ చైర్మెన్‌గా ఖానాపురం ఎంపిపిగా కొనసాగారన్నారు. నియోజకవర్గ కన్వీనర్‌గా పార్టీకోసం చేసిన కృషిని గుర్తించి దొంతి మాధవరెడ్డి సూచన మేరకు ఆయనను పీసీసీ ద్వారా జిల్లా కాం గ్రెస్ అధికార ప్రతినిధిగా నియమించారని వారు పేర్కొన్నారు. పార్టీ కోసం పాడుపడుతూ రాబోయే రోజులు ఉన్నత పదవులు అందిపుచ్చుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కుమార్, మాదాసి రవి, వేముల సారంగంగౌడ్, ఎండి.మసూద్, ఎండి.బాబా, గాజుల రమేశ్, నాగెం నగేశ్, వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 1 : వర్ధన్నపేట పట్టణంలోని రెండో వార్డులోని రాజస్థాన్ కాలనీలో డీటీఆర్ (ట్రాన్స్ ఫార్మర్) మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని వర్ధన్నపేట ఏడీఈ కన్న రాజు ఒక ప్రకటనలో తెలిపారు. మిగతా పట్టణమంతా యథావిధిగా విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు.

• చెన్నారావుపేట: మండలంలోని ఉప్పరపల్లి ఉపకేంద్రం పరిధిలో ఫీడర్ లైన్ మరమ్మతు ల కారణంగా ఈ నెల 2వ తేదిన ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరాఫరాను నిలిపివేయనున్నట్లు డీఈ శ్రీధర్‌రాజు, ఏఈ జోగానంద్‌లు తెలిపారు.

• నర్సంపేట టౌన్ : పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీ, సర్వాపురం. గాంధీవిగ్రహం, సాయినగర్, రాజీవ్ నగర్, ఎస్సీ కాలనీ, ద్వారకపేటరోడ్ ప్రాంతాల్లో కరెంట్ లైన్‌మెయింటనెన్స్ పనులు జరుగుతున్నందున ఈనెల 2న ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు కరెంట్ సరఫరాలో అంతరాయంఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీధర్ తెలిపారు.

• పర్వతగిరి: మండలంలోని చౌటపెల్లి సబ్ స్టేషన్ పరిధిలోని చౌటపెల్లి,కొంకపాక, సోమారం, జమాల్‌పురం, గుంటూరుపల్లి గ్రామాల్లో మరమ్మతులకారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రవి కుమార్ తెలిపారు.

దొంగతోనే కండువా కప్పుకొంటివి..

(5వ పేజీ తరువాయి)

విమర్శించారు. స్టేషన్‌ఘనపూర్ ప్రజలకు తాను అండగా ఉంటానన్నారు. దాస్యం వినయభాస్కర్ మాట్లాడుతూ కడియం జీవితమ్మంతా నీచ చరిత్రేనని, దళితుడని అని చెప్పుకొనే ఆయన.. ఏ రోజు దళితులను చేరదీయలేదన్నారు. కడియం ఇబ్బందులు భరించలేకనే రాజయ్య, అరూరి రమేశ్, పసునూరి దయాకర్ బీఆర్‌ఎస్‌ను వీడారన్నారు. ఇన్ని పార్టీలు మారిన కడియం.. కేఏపాల్ ప్రజాశాంతి పార్టీకి కూడా పోతాడని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, జడ్పీ చైర్మన్‌లు సుధీర్‌కుమార్, గండ్రజ్యోతి, మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, సుందర్‌రాజ్, నేతలు నాగుర్ల వెంకటేశ్వర్లు, భీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, కె.వాసుదేవరెడ్డి, లలితాయాదవ్, హరిరమాదేవి, ఇండ్ల నాగేశ్వర్‌రావు, జనార్ధన్‌గౌడ్, జోరిక రమేశ్, వీరేందర్, రజనీకుమార్, చింతల యాదగిరి తదితరులు పాల్గొన్నారు. కాగా, హరీష్‌రావు మాట్లాడే క్రమంలో చిట్యాలకు చెందిన కంజర్ల రమణకుమార్ అనే కార్యకర్త ఒక్కసారిగా వేదికపైకి వచ్చి కాళ్లకు మొక్కి సెల్ఫీ తీసుకున్నాడు. ఎన్నికల సమయంలో రేవంతర్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాలను స్క్రీన్‌పై చూపిస్తూ ప్రసంగించినప్పుడు కార్యకర్తలనుంచి మంచి స్పందన వచ్చింది.

కావ్యకే టికెట్

(5వ పేజీ తరువాయి)

తెరపడడంతో ఇక తరువాత పరిణామాలు ఎలా ఉంటాయనే అంశం చర్చంశనీయాంగా మారింది.

అనూహ్యంగా టికెట్ సొంతం

కొన్ని రోజుల కిందట బీఆర్‌ఎస్ అభ్యర్థిగా డాక్టర్ కావ్యను ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. దీంతో కావ్య పోటీకి రంగం సిద్ధమైంది. ఇక ప్రచారమే తరువాయి అనుకుంటున్న సమయంలోనే కడియం కావ్య బీఆర్‌ఎస్‌కు కోలుకోలేని షాక్ ఇచ్చారు. కవిత అరెస్టు, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలను ఉటంకిస్తూ బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేయలేనంటూ స్పష్టం చేయడంతో బీఆర్‌ఎస్‌కు పెను దెబ్బ తగిలింది. ఆ వెంటనే కడియం శ్రీహరి కూడా బీఆర్‌ఎస్‌కు బైబై చెప్పడం.. తండ్రి, కూతురు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు సంకేతాలు ఇవ్వడంతో ఊహించని రాజకీయ పరిణామాలు తెరపైకి వచ్చాయి.

ఎమ్మెల్యేలను కలుస్తున్న తరుణంలోనే..

కడియం శ్రీహరి, కావ్య హైదరాబాద్‌లో కాంగ్రెస్‌లో చేరిన తరువాత సోమవారం వరంగల్‌లోనే ఉదయం నుంచి పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలను కలుస్తూవచ్చారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును వారి వారి క్యాంపుకార్యాలయాల్లో కలిశారు. నాగరాజు కార్యాలయంలో మీడియాతో కూడా శ్రీహరి, కావ్య మాట్లాడారు. టికెట్ విషయాన్ని మీడియా ప్రస్తావించినా ఏ మాత్రం కూడా బయట పడకుండా మాట్లాడారు. ఆ తరువాత సాయంత్రం మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిని వారి నివాసంలో కలిశారు. ఇలా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను కలుస్తున్న తరుణంలోనే కావ్యకు టికెట్ ఖరారైందనే వార్తలు వెలుబడ్డాయి.

పోటీపడ్డ నేతలకు చుక్కెదురు

వరంగల్ లోక్‌సభ టికెట్‌పై పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులతో పాటు ఇతరులు కూడా సీరియస్‌గా ప్రయత్నించారు. ఎందరి పేర్లో తెరపైకి వచ్చాయి. ఒక విధంగా స్థానికేతరుడైన అద్దంకి దయాకర్ పేరు కూడా తొలి నుంచి వినిపించింది. ఇక జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు దొమ్మాటి సాంబయ్య, నమిండ్ల శ్రీనివాస్, డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్, బొడ్డు సునిత, జన్ను పరంజ్యోతి, డాక్టర్ అనిల్, డాక్టరు పెరుమాండ్ల రామక్రిష్ణ.. ఇలా ఎందరో నాయకులు టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేయగా నిరాశే ఎదురైంది. కడియం కావ్యకు టికెట్ కేటాయింపుపై ఆశావహులతో పాటు కాంగ్రెస్ శ్రేణుల్లో కూడా అసంతృప్తి నెలకొంది.

5 నుంచి ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

పర్వతగిరి, ఏప్రిల్ 1 : మండలంలోని వడ్లకొండలో ఈ నెల 5, 6, 7తేదీలలో ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు క్రీడా కమిటీ అధ్యక్షుడు మంద రాము తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ.20,116, ద్వితీయ 15,116, తృతీయ రూ.10,116, చతుర్థ బహుమతి రూ.8,116 అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు 8008200905, 9491672037 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గౌరవఅధ్యక్షుడు చెడుపాక రాజు, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు వల్లందాసు రమేష్, కార్యదర్శి వల్లందాసు రాజ్‌కుమార్, క్రీడాకమిటీ ఉపాధ్యక్షుడు వి.కుమారస్వామి, వెంకన్న పాల్గొన్నారు.